
ॐ

శ్రీనివాస శతకము

(పద్య కవితా సంపుటి)



చింతలపాటి పూర్ణచంద్రరావు

ప్రథమశ్రేణి తెలుగు పండితుడు

ఘంటశాల - 521 133

కృష్ణాజిల్లా, ఎ.పి.

ప్రథమ ముద్రణము
మార్చి 2000
కాపీలు : 1000

ప్రతులకు :

చింతలపాటి వేంకట లక్ష్మి
W/o. CH. POORNACHANDRA RAO
Telugu Pandit,
కూచిపూడి – 521 136, కృష్ణాజిల్లా,
(ఫోన్ నెం. : 08671–52717)

వెల : రూ. 45/-

డి.టి.పి.
సిహెచ్.వి.స్వామి, తిరుపతి.

ముద్రణ :
శ్రీ పరాశర్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
శ్రీవ్యాసాశ్రమము, ఏర్పేడు,
చిత్తూరు జిల్లా.

THIS BOOK IS

PUBLISHED WITH THE FINANCIAL ASSISTANCE OF

TIRUMALA TIRUPATI DEVASTHANAMS

UNDER THEIR SCHEME

"AID TO PUBLISH RELIGIOUS BOOKS"

‘అంకితము’



కీ॥శే॥ ‘పండితరత్న’ చింతలపాటి లక్ష్మి నరసింహ శాస్త్రిగారు
(1922–1986)

సరస సంభాషణా సంశోభితాత్మచే స్నేహార్ద్ర భావంబుచిందజేసి
సంస్కృతాంధ్ర జ్ఞాన సంపద్విభూతిచే చక్కని గ్రంథాలు సంతరించి,
జాతీయ భాషా విశారదత్వమ్ముచే శిష్యకోటికి లక్ష్య సిద్ధి గూర్చి,
వేదాంత విద్యా వివేకాతిశయముచే పరతత్త్వ బోధనా పటిమ జూపి,

‘కావ్యభూషణ’ బిరుదాన గణనకెక్కి,
రహిని ‘పంచాంగ కర్త’గ ప్రణుతి నొంది,
మహిని ‘పండితరత్న’ సమ్మానమంది,
చెన్ను మీరె ‘లక్ష్మీనరసింహ శాస్త్రి’
అట్టి నా తండ్రికీ పొత్తమంకితంబు!!

ఆచార్య
జి. వి. సుబ్రహ్మణ్యం
రిటైర్డు తెలుగు ప్రొఫెసర్,
హైదరాబాదు విశ్వవిద్యాలయం,
హైదరాబాదు.

'మనిషి పాట'

పద్యాలు వ్రాయటం వేరు, శతకం వ్రాయటం వేరు. పద్యమంటే ఒక భావం యొక్క హృద్యావతారం. హృద్యమైన పద్యశతాన్ని సృష్టించే మహాయజ్ఞం శతకం. శతకం కథ చెప్పే రచన కాదు. కవి తన బాధను బోధను చెప్పుకొనే స్వీయమైన మధుర వ్యధ. కథా రచనలో కవిలోని వ్యధ పరకాయ ప్రవేశం చేస్తుంది. శతకంలో ఆత్మీయంగా, ఆత్మాశ్రయంగా, ఆర్ద్రంగా సొంత గొంతులో పొంగులు వారుతుంది. కథలో కవి తన్మయుడౌతాడు. శతకంలో కవి పూనకం పూనుతాడు. శతకం కవి జీవితంలో ఒక ఆత్మయజ్ఞం. అందులో అతడే అగ్ని, అతడే యజమాని, అతడే ఋత్విజుడు. శ్రీ చింతలపాటి పూర్ణచంద్ర రావుగారు అటువంటి ఆత్మయజ్ఞాన్ని అక్షరమయంగా ఆవిష్కరించారు – 'శ్రీనివాస శతకం' గా.

విశేషమేమంటే శ్రీ చింతలపాటి వారు శతకానికి ఒక నక్షత్ర మాలను, ఉపాయనంగా అందించారు. పంచరత్నాలను కానుకగా ఇచ్చారు. సప్తకాన్ని దక్షిణగా పెట్టారు. ఉపాంగ సుందరంగా శతకం హృద్యంగా కనవడుతోంది. కవిగారి వృత్త రచనా విలాసం ఉపాయనాలలో ఉజ్జ్వలంగా ప్రకాశిస్తోంది. ధారాళమైన ఆశు

కవితా ప్రవాహం వృత్తాలలో పరుగులు తీస్తోంది. మనసులోని మాటను మర్మం లేకుండా వేంకటేశ్వరస్వామికి నివేదించుకొనే సంవేదన పద్యంలో వేడిగా వినిపిస్తుంది. లోకం పోకడను లోక నాథునికి నివేదించుకొనే లోకజ్ఞత అందులో రవళిస్తుంది. మచ్చు కొక పద్యం చాలు వృత్త రచనా ప్రవృత్తికి –

'అంతము లేనిదీ జగతియంతయు మాయ యటంచు నేదొ వే
దాంతము పల్కుచుందురు గదా! సభలందున; నుంత వారిలో
గాంతుమె చిత్తశుద్ధిని యొకానొక పట్టున నైనగాని, యే
కాంతమునం దొనర్చెడి వికారములం గను వేంకటేశ్వరా!!'

ఈ వృత్తం కవిగారి చిత్త వృత్తిని బయట పెడుతోంది. వీరు భక్తులు కారు, కానీ ధర్మ సంరక్షులు. వీరు పాండిత్యం ప్రదర్శించుకొనే ప్రగల్భులుకారు, కాని పాండిత్యం అంటే ఏమిటో తెలిసిన వినయ వివేకులు. వీరు సంఘ సంస్కర్తలు కాకపోవచ్చును కాని, సంస్కరణకు కావలసిన ఉత్తమ సంస్కారం కలవారు. వీరు తెగబడి సాహసించే వారు కారు, కాని ఉన్న విషయాన్ని కన్న విషయాన్నీ తెగబడి తెలివిగా చెప్పేవారు. ఈ స్వభావం ఉన్నవారు వృత్తాలలో ధూర్జటిలా నివసించిందానికంటె ఆటవెలదులతో వేమనలా ఆటలాడుకో గలరు. అందుకే వృత్తాలలో నక్షత్ర మాలలో వ్రాశారు. ఆటవెలదుల్లో శతకాన్ని సారించారు.

ఆటవెలదిని వశ్చిన కవి అచ్చమైన తెలుగు నుడికారాన్ని పుక్కిట పెట్టుకుంటాడు. ఆటవెలది ముద్దు ముద్దుల తెలుగు నుడి కారాలకే ముచ్చట పడుతుంది. చింతలపాటి వారికి ఆటవెలదిని అదుపు చేసే పూర్ణచంద్ర యోగం పుట్టుకతో అబ్బింది. అందువలన ఈ శతకం ఆ ఛందస్సుకు ఒక పథకంలాగా అమరింది.

ఆట వెలదిలో శతకం ఎవరు మొదలు పెట్టినా లోకంలో వేమనతో పోటీ పడుతున్నట్లుగా అనుకుంటారు. వేమన పద్యంతో ఆ కవి పద్యాన్ని పోలుస్తారు. ఆ పోటీలో నెగ్గటం అంత తేలికైన పని కాదు. అయినా ప్రతి కవీ తన ప్రతిభతో ఒక ప్రత్యేకతను చాటు కోవటానికి ప్రయత్నిస్తాడు. మరొక మాటలో చెప్పాలంటే వేమన తరువాత ఆటవెలదిలో మకుటంతో శతకం వ్రాయటం ఒక సాహసం! ఒక సవాల్!

ఈ సత్యం తెలిసి కూడా ఆట వెలదిలో శతకం వ్రాయాలను కున్న శ్రీ చింతలపాటి పూర్ణచంద్రరావుగారు నిజంగా అభినంద నీయులు. ఎందుకంటే - వేమన ఆట వెలది కంటే చింతలపాటి వారి ఆటవెలది ఆటలో, మాటలో, పాటలో తన బాణీ తనదిగా సాగిస్తోంది కాబట్టి. ఈ అంశాన్ని ఎంతైనా వివరించవచ్చు. పఠితకు మిగల్చకుండా పీఠికా కర్త అన్నీ చెప్పివేయటం న్యాయం కాదు. అయినా ఒకటి రెండైనా చెప్పక పోతే మర్యాద కాదు.

వేమన మకుటం ఆట వెలది పాదమంత. చింతపాటి వారి మకుటం మునివ్రేళ్ళంత. పద్యం నాలుగో పాదంలో అయిదింట మూడు వంతులు త్రోసికొనివచ్చి వేమన పద్య వేషాన్నే మార్చి వేసింది. ఈ ఆటవెలది ఎక్కువగా మాటవెలది అయింది.

'మనిషి కట్టు కున్న - ఇనుప గోడలె గాని
కులమతాలు లేవు - కువలయాన,
మంచి మనసుకన్న - మతమేది? కులమేది?
మానవాళి కిలను - శ్రీనివాస!!'

వేమన పద్యంలోని నిర్మాణ శిల్పాన్ని చింతలపాటి వారు

సొంతం చేసికొని సొంతబాణీలో చెప్పుకొన్నారు. ఆయన పద్యం లో ఈయన పద్యంలో మూడవ పాదం ముత్యాలమూట. లోక నీతికి బాట. మానవ ప్రవృత్తికి మేలుకొలుపు పాట. అయితే మొదటి రెండుపాదాలను పలికించే తీరు వేమనది కాదు చింతల పాటి వారిది.

వేమన లోకాన్ని జల్లెడ పడతాడు. చింతలపాటి వారు లోకాన్ని పట్టి చూస్తారు. వేమన అడ్డమొస్తే పడతిడతాడు. చింతలపాటి వారు లోకాన్ని మందలిస్తారు. ఏమైనా వేమన అన్నీ వదులుకొన్న యోగి. కాని చింతలపాటి వారు అన్నీ తెలుసుకొన్న బడి పంతులు. వేమన ప్రబోధిస్తాడు. చింతలపాటి బోధిస్తాడు. ఈతేడా ఆటవెలదుల్లో కనబడుతుంది. ఆటవెలదిని చేపట్టినా చింతలపాటి వారు అన్నమయ్య కావాలనుకుంటాడే కాని వేమన కావాలను కోడు. ఈ మాట వినండి –

'అన్నమయ్య వోలె – ఆరాధకుడనౌచు,
త్యాగరాజు రామ – తత్త్వమరసి
మానవత్వమున్న – మనిషిగా బ్రతికెద
క్షితిని మేలు గూర్చు – శ్రీనివాస!!'

యోగిగా ఆటవెలదిని ఆడించటం ఆనాటి వేమన ధర్మం. మనిషిగా ఆటవెలదిని గౌరవించటం పూర్ణచంద్రుని ఈనాటి కర్తవ్యం. వారి ఆకాంక్షను శ్రీనివాసుడు సఫలం చేయాలని మనసారా కోరుతూ, నోరారా అభినందిస్తున్నాను.

శ్రీవాణి, 1–8–702/105, నల్లకుంట,
హైదరాబాదు – 500 044
ది 15.1.2000, సంక్రాంతి. – జి.వి. సుబ్రహ్మణ్యం.

సముద్రాల లక్ష్మణయ్య, ఎం.ఎ.,
మాజీ కార్యదర్శి, ధర్మ ప్రచార పరిషత్,
తిరుమల తిరుపతి దేవస్థానములు.
తిరుపతి.

తెలుగులో శతక సాహిత్యం అతి విస్తృతంగా వృద్ధి చెందింది. లోకోత్తరమైన సంస్కృత సాహిత్యంలో సైతం తెలుగులో వలె శతక సాహిత్యం పెంపొందలేదు.

భక్తి, నీతి, లోకవ్యవహారం మొదలైన ఎన్నో అంశాలను శతక కవులు తమ రచనలలో రమణీయంగా ప్రతిపాదించారు. శ్రీకాళహస్తీశ్వర శతకం, సుమతీ శతకం, భాస్కర శతకం మొదలైనవి బహుళ ప్రచారం పొందాయి. ప్రాక్తన కవుల ననుసరించిన ఆధునిక కవులనేకులు శతకాలను కోకొల్లలుగా రచించారు.

కవిత్వాన్ని అభ్యసించే రోజుల్లో శతక రచన కావించడం కవుల సంప్రదాయం. అందువల్లనే పద్య రచనా వ్యాసంగం వెనుకబడి పోయిన ఈ రోజుల్లో కూడా కవులు శతక రచన కావిస్తూనే వున్నారు.

శ్రీ చింతలపాటి పూర్ణచంద్రరావుగారు రచించిన '**శ్రీనివాస శతకం, వృత్త సంకీర్తనం**' అన్న రచనలు పరిశీలించాను. శ్రీ పూర్ణచంద్రరావు గారు విద్వత్కుటుంబంలో జన్మించారు. '**పండితరత్న**' **శ్రీ చింతలపాటి లక్ష్మనరసింహశాస్త్రి**గారి కుమారులు వీరు. వీరి తండ్రిగారు 'జ్ఞానవాశిష్ఠానువాదం' మొదలైన గ్రంథాలు రచించిన

పండిత ప్రకాండులు.

వీరు 'విద్వాన్' పట్టభద్రులై కృష్ణాజిల్లాలో ప్రథమ శ్రేణి తెలుగు పండితులుగా పని చేస్తున్నారు. కవితలోనే కాక ధార్మిక ప్రవచనం లో కూడా నైపుణ్యం కలవారు. అనేక సంస్థలలో ప్రసంగించి శ్రోత లను అలరించిన వారు. శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులుగా పలు సమాజ సేవా కార్యక్రమాలలో అగ్రగామిగా వున్నారు.

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి నుద్దేశించి 'శ్రీనివాస' అన్న మకుటంతో శ్రీ పూర్ణచంద్రరావుగారు రచించిన శతకం భక్తిభావ బంధురమై సహృదయావర్జకంగా అలరారు తున్నది. ఇందలి పద్యాలు రమణీయ రచనా సౌభాగ్యంతో విలసిల్లి భావుకులు భావించే కవులని చవులూరుతున్నాయి.

''భద్రకరములైన - భవదంఘ్రియుగ్మంబు
శ్రీకరంబు మాకు - శ్రీనివాస''

అన్నచోట 'భద్రకరము' అనే మాట 'మోక్షప్రదము' అనే అర్థాన్ని సూచిస్తూ -

''పార్థాయ తత్సదృశః సారథినా త్వయైవ
యౌదర్శితే స్వచరణౌ శరణం వ్రజేతి।
భూయోఽపి మహ్యమిహతౌ కరదర్శితౌతే
శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే॥'' అన్న

శ్రీవేంకటేశ్వర ప్రపత్తిలోని శ్లోక భావాన్ని స్మరింపజేస్తున్నది.

''చెట్టు చేమలన్ని - ఛేదించి వేసినన్
వన్య మృగములన్ని - వలసబోవు,

నిలువ నీడలేక – నీరసింతురు జనుల్
జీవితాశ విడిచి – శ్రీనివాస॥''

అన్న పద్యం నేటి పర్యావరణ సమస్యను వ్యక్తం చేస్తున్నది.

''చదువు 'కొన్న' వారి – సరసత్వ మంతయు''

ఇత్యాది పద్యాలు నేటి సమాజ స్థితికి దర్పణం పడుతున్నవి. వీరు తమ రచనలో –

''నొసలు వెక్కిరింప – నోరు మాటాడెడి''

''అందినపుడు జుట్టు – అందకున్నను కాళ్ళు''

ఇత్యాదిగా కొన్ని సామెతలను సందర్భానుసారంగా ప్రయోగించి తమ రచన విలువ పెంచుకున్నారు.

ఇక 'వృత్త సంకీర్తన' భాగంలో 'శ్రీ వేంకటేశ్వర నక్షత్రమాల'లో వృత్తాల రచన మధురంగా, మంజులంగా సాగి మాననీయమై వున్నది. మనోజ్ఞమైన ఊహలతో, చక్కని ఉపదేశాలతో, ఇంపైన పదజాలంతో రచింపబడిన ఈ గ్రంథం పాఠకులకు అమందానంద సంధాయకం కాగలదని ఆశిస్తున్నాను.

పద్యాలపై మోజు తగ్గిన ఈ రోజుల్లో పాఠకులను, శ్రోతలను ఆకర్షించే విధంగా పద్య రచన సాగించి శ్రీనివాసుని దయకు పాత్రులైన పూర్ణచంద్రరావుగారిని మనసారా అభినందిస్తున్నాను.

ఫోన్: 30679, 18–1–84,
కె.టి.రోడ్డు, తిరుపతి,
ది. 26.8.1999. **– సముద్రాల లక్ష్మణయ్య.**

'సరస్వతి కంఠాభరణ'
డాక్టర్ ప్రసాదరాయ కులపతి,
శ్రీనాథ పీఠ నిర్వహణాధ్యక్షులు,
రిటైర్డు ప్రిన్సిపాల్, హిందూ కళాశాల,
గుంటూరు - 522 001.

'అభినందన'

చింతలపాటి పూర్ణచంద్రరావుగారు తిరుపతిలో నేను చదువుకొనే రోజుల్లో సమకాలికులు. చాల కాలానికి వీరి తండ్రి గారు **'పండితరత్న' శ్రీ చింతలపాటి లక్ష్మనరసింహ శాస్త్రి**గారు తమ తపఃఫలితంగా రచించిన **'కూచిపూడి-భాగవతులు'** అనే అపురూపమైన గ్రంథానికి అభిప్రాయం వ్రాయటం కూడా జరిగింది. మళ్ళీ ఇన్నాళ్ళకు శ్రీ పూర్ణచంద్రరావుగారు వారు రచించిన **'శ్రీనివాస' శతకానికి** అభిప్రాయం కోసం వచ్చారు. ఎన్నేండ్లు గడిచినా చెక్కు చెదరని వారి అభిమానం, పెరిగిన గౌరవం నా చేత నాలుగు మాటలు వ్రాయిస్తున్నవి.

పద్య కవితకు ఆదరం తగ్గిందని చాలా మంది భావిస్తున్న కాలంలో సాహితీ సరస్సులో ఉదయించిన, వికసించిన కమనీయ కమల మీ కావ్యం. ముక్తక జాతికి చెందిన ఈ శతకంలో భక్తి, సామాజిక స్పృహ, లౌకికాలౌకిక భావ సమ్మేళనం అన్నీ సమరస ధోరణిలో కలసి కనిపిస్తున్నవి. పద్యం హృద్యంగా ఉండాలనీ, అది తళుకు లీనుతూ ఉండాలనీ వీరి అభిప్రాయం 2వ ప॥ లలిత భావ జాలము రావాలంటే చిత్తశుద్ధి ఉండాలనేది వీరి

విశ్వాసం (1వ ప॥)

భక్తిలో ఎన్నో పంథాలున్నా మధుర భక్తి అంటే వీరి కెక్కువ మక్కువ (4వ ప॥). కష్టాలలో ఉన్నప్పుడు గళమెత్తి పిలిస్తే ఏడు కొండల వాడు పరుగెత్తుకొని వస్తాడని, ఆయన ఆర్తత్రాణ పరాయణుడని వీరి దృఢమైన నమ్మకం (12వ ప॥). భాగవతంలో పోతనగారు 'నీ పాదార్చకుల తోడి నెయ్యము' నర్థించినట్లుగా 'జన్మజన్మలందు సత్సంగ మిమ్మని పూర్ణచంద్రరావు గారు 20వ ప॥ లో ప్రార్థిస్తున్నారు. పూవు వాడిపోయే వరకు వాసనలు వెదజల్లు తూ చివరకు రాలిపోతుంది. బ్రతుకూ అంతే. అయితే 'నేల బడక ముందే – నీ యుస్కి గమనించు రీతులెల్ల తెలుపుమని 27వ ప॥ లో శ్రీనివాసుని రచయిత వేడుకొంటున్నాడు. సత్సంగం ఎంత అవసరమో దుస్సంగం అంత పరిహార్యమని 'కుటిల జనుల తోడ కూడ రాదిలపైన' అని కవి 48వ ప॥లో కొచ్చరిస్తున్నాడు.

ఈ విధంగా ఆటవెలదులతో వేంకటేశ్వరునకు అష్టోత్తర శత పుష్ప మాలిక తీర్చి అంతతో సంతృప్తి చెందక వృత్తాలలో, గీతాలలో, స్వామిని స్తుతించారు. అవి కూడా ఎంతో రస రమణీ యంగా, భావ భరితంగా భాసిస్తున్నవి. ఇంత చక్కని రచన చేసిన పూర్ణచంద్రరావుగారిని అభినందిస్తూ ఈ గ్రంథం సహృదయ హృదయంగమం కాగలదనీ, శ్రీనివాసుని కరుణకు పాత్రం కాగలదనీ ఆశిస్తున్నాను.

భద్రమస్తు!

గుంటూరు,

15.12.1999. — **డాక్టర్ ప్రసాదరాయ కులపతి.**

'సహస్రావధాని'
డా॥ మేడసాని మోహన్
డైరక్టర్ ఆఫ్ అన్నమాచార్య ప్రాజెః, టి.టి.డి.,
తిరుపతి - 51¯ 50¯.

'భక్తి భావ ముకురం - శ్రీనివాస శతకం'

'శత' శబ్దం అత్యంత విలక్షణమైనది. మన ఆర్ష దృష్టికి మూల భూతమైనది. ఈ దేశంలో పుట్టిన ప్రతి భారతీయుడు 'జీవేమ శరదశ్శతమ్', 'నందామ శరదశ్శతమ్' అని భావించడం పరిపాటి. 'అశ్వావంతం శతగ్వినమ్' అన్న పంక్తులు ఇందుకు మరో చక్కని ఉదాహరణ. శతము అనడానికి బదులు 'శతకమ్' అన్న పదం మన వాఙ్మయంలో ప్రచారం పొందింది. ఇందలి 'కన్' ప్రత్యయం స్వార్థమున వాడబడటం వల్ల అర్థ భేదము లేదు.

తాళ్ళపాక అన్నమాచార్యుల శతక రచనలకు ముందే వృషాధిప శతకము వంటి గ్రంథములు తెలుగులో ఉన్నట్లుగా సాహిత్య చరిత్ర తెలియు జేస్తున్నది. శతకాలు ప్రధానముగ భక్తి శతకములుగ, శృంగార శతకములుగ, నీతి శతకములుగ గోచరిస్తు న్నాయి. తెలుగువారికి గర్వకారణమైన ప్రబంధములలోని కవిత్రయ రచనలలోని పద్యములు రాని వారు కూడా ఆంధ్ర దేశములో ఉన్నారు. కానీ అంతో ఇంతో అక్షర జ్ఞానం ఉన్న ప్రతి తెలుగువాడికీ సుమతీ శతకం, భాస్కర శతకం, వేమన శతకం వంటి శతకములలోని పద్యములు కొన్నైనా నోటికి వచ్చునన డంలో అతిశయోక్తి లేదు. కొంత తెలుగు సాహిత్య జ్ఞానమున్న

వారికైతే ధూర్జటి 'కాళహస్తీశ్వర శతకం', కాసుల పురుషోత్తమ కవి 'ఆంధ్ర నాయక శతకం', గోగులపాటి కూర్మనాథకవి 'సింహాద్రి నారసింహ శతకం', కంచెర్ల గోపన్న కవి 'దాశరధీ శతకం' ఆ జీవనం మరువ లేనివి.

ఈ శతక సాహిత్య ప్రక్రియా రచన ఆధునిక కవిత్వ ప్రభంజనం లో కొట్టుకు పోలేదు. నేటికీ తన అస్తిత్వాన్ని నిలబెట్టు కొంటోంది సగర్వంగా. ఈ నేపథ్యంలో చెప్పుకోదగ్గ శతకం శ్రీ **చింతలపాటి పూర్ణచంద్రరావుగారి 'శ్రీనివాస శతకము'**. భక్తిభావ సమన్వితమైన వీరి శతకంలోని ప్రతి పద్యంలో ఆవేదనా భరితమైన వీరి హృదయ స్వచ్ఛత, ఆర్ద్రత మంచుగా కురిసి అవి ముత్యాలై మిలమిలా మెరుస్తున్నాయి. తేట తెలుగులోని అచ్చమైన ఈ కవితా మాధుర్యానికి శ్రీనివాసుని యందున్న భక్తియే మూల కారణము.

'మాయజాలమెల్ల – మంత్రముగ్ధులజేయ
పరమ యోగులైన – భ్రమయు చుంద్రు
అరణేయు జన్మ – కాధార మదిగాదె
చిన్మయాంతరంగ – శ్రీనివాస!!'

భగవల్లగ్నమైన చిత్త పరిపాకం భక్తి. అది యఖండమైన చిన్మయానందం కోసం ఆవేదన పడుతుంది. ఇందుకు భ్రమను తొలగించుకొనే శక్తి కావాలి. అందుకూ స్వామినే ఆశ్రయించాలి. కర్మబంధాలన్నింటికీ శ్రీనివాసుడే సూత్రధారి. అందుకే కవి ఇలా అంటున్నాడు.

'పాప పుణ్య కర్మ – ప్రారబ్ధ విభవమ్ము
కాల గమనమందు – కట్టు గట్టి

జనన మరణ దుఃఖ – మనుభవింపగ జేయు
శిక్షకుండవీవె – శ్రీనివాస!!'

మనో రుజాలను తొలగద్రోసి, అమలిన భక్తితో శ్రీనివాసుని భావిస్తే సకల సంపత్స్వరూపుడు అంతరాంతరాలలోనే సాక్షాత్కరిస్తాడు.

'సర్వ భూతములకు – సాక్షిగా నిలుచుండి
ధర్మముద్ధరింప – తనువుదాల్చి
అంతరాంతరాల – ఆత్మగా వెలుగొందు
చిన్మయుండ వీవె – శ్రీనివాస!!'

అంతస్సంవాద జనితమైన ఈ సంవలిత శోభ భగవత్పరంగా పర్యవసానం పొందటం వల్లే శ్రీనివాసుని సత్యస్వరూపం పూర్ణచంద్రరావుగారి పద్యాలలో దర్శనమిస్తున్నది.

'యాగ భాగ చయము – లారగించెడిదేవ!
బ్రతుకులోని యనుభ – వాల నిటుల
విన్నవించుకొంటి – వినయమింపెసలార
శ్రేయ మొనరజేయు – శ్రీనివాస!!'

కవి యజ్ఞభోక్తకు తన అనుభవాలను విన్నవించుకొన్నాడు. జలజనాభునికి ప్రీతి కలుగునట్లు శతకాన్ని సమకూర్చారు. ఇందుకు అనుబంధంగా ఉన్న 'వృత్త సంకీర్తనము' మరో అనుబంధము వీరికి స్వామితో

'సురుచిర రూప సంపదల సోయగముల్ వెలయించువాడవై
పరమ మునీశ్వరేశ్వర తపః ఫల కాంతుల చెన్ను మీరుచున్

కరమనురక్తి మీర మమకారములన్నియు డుల్లజేసి యీ
ధరణిని గాచు పెద్ద సరదారుడ వీవెగ వేంకటేశ్వరా॥'

పరమ ప్రేమ రూపమైన భక్తితత్వాన్ని వ్యాపింప జేశారు. శుద్ధ సత్వజ్ఞానం ఎలా వెలుగుతుందో అది అజ్ఞానాన్ని దహింపజేసి భక్తి జ్ఞాన వైరాగ్యాలను ఎలా చాటుతుందో మనం ఈ కావ్యంలో దర్శిస్తాం. ఇటువంటి ప్రసన్నమైన భావనా తపస్సుకు శతక కవిత్వ రూప ఆకారాన్ని అందించిన శ్రీ **చింతలపాటి పూర్ణచంద్రరావు** అభినందనీయులు. శ్రీ స్వామి వారి కృపకు పాత్రులైనారు.

తిరుపతి,

ది. 2.12.1999. – ***డాక్టర్ మేడసాని మోహన్.***

'అవధాన విద్యా వాచస్పతి', 'ఆశుకవితా సమ్రాట్', 'ద్విశతావధాని'
రాళ్ళబండి కవితా ప్రసాద్
డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్
మచిలీపట్నం - 52- 002.

ఇది 'పూర్ణచంద్రుని' పద్య కౌముది

'తిరుపతి కొండపైన పరిధీకృత మంత్ర విశేష శబ్ద సుం
దరమయ వర్తులాంతర సుధామయ హాస సురోచికావళీ
భరిత ముఖాంబుజాత విశుభత్వ మహత్వ దృగంచలాత్తవి
స్ఫురిత మనోజ్ఞ దర్శన వశున్ ననుజేయవె వేంకటేశ్వరా!!'

ఒకానొక బ్రాహ్మీమయ ముహూర్తాన, శరన్మేఘాలు తలపాగాలా చుట్టుకున్న ఆదిశేషుని స్వరూపమైన తిరుపతి కొండపైన స్వర్ణగోపురం క్రింద, అష్టాక్షరీ మంత్రధ్వనుల ప్రాకారం మధ్య స్వామి శ్రీనివాసుని దర్శనం జరిగినప్పుడు అప్రయత్న కృతంగా వెలువడిన పద్యమిది.

మంచు బిందువులు ముక్కు పుడకలుగా ధరించిన పూల కన్యలు స్వామి పాదాలపై పడి మురిసి పోతున్న శుభక్షణాలలో నేను మానవుణ్ణైనందుకే స్వామి సమీపంలో ఉండి పోయాను. పూవునైతే స్వామి పాదాలు తాకేవాణ్ణి - పరవశించేవాణ్ణి. సాలోక్య - సామీప్య - సారూప్య - సాయుజ్య స్థితులలో రెండింటిని మాత్రమే అర్చా విగ్రహం దగ్గర - భౌతిక శరీరంతో పొందగలిగాను. అదంతా ఒక భౌతిక కాలమాన పరిస్థితులలో దొరికిన అనుభూతి.

అనుభూతులు మూడు రకాలు. భౌతికమైన అనుభూతి - మానసికమైన అనుభూతి - ఆధ్యాత్మికమైన అనుభూతి. జన్మ సంస్కారాలను బట్టి అనుభూతుల విభూతి లభిస్తుంది.

'అనుభవాల గూటిలో
అనుభూతులను పొదిగే గుడ్డు గుండె
సమయం రాగానే
ముక్కుతో పొడిచి వేగంగా ఎగిరిపోయే
విహంగం కవిత...

కవిత్వం ఒక ఆత్మీయమైన అనుభూతికి అక్షర రూపం - శబ్ద రూపం. శూన్యంగా ఉన్న విశ్వం నుంచి పదార్థాన్ని సృష్టించడానికి బ్రహ్మకు ఎంతటి సాధనా నేపథ్యం ఉంటుందో - శూన్యంగా ఉన్న మనస్సు నుంచి కవితా పదార్థాన్ని సృష్టించడానికి కవిబ్రహ్మ కు అంతటి వేదనా నేపథ్యముంటుంది.

ఆ వేదన ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణిస్తే -
ఆ వేదన సామాజిక నిష్ఠమైన అంశాలతో పల్లవిస్తే -
ఆ వేదన స్వీయానుభవాల పౌష్కల్యంతో ప్రభవిస్తే -
ఆ వేదన సార్థకమౌతుంది. పరమార్థ ప్రదాయకమౌతుంది. అలాంటి కృతికి ఆకృతి శ్రీ చింతలపాటి పూర్ణచంద్రరావుగారి శ్రీనివాస శతకం.

శ్రీ చింతలపాటి పూర్ణచంద్రరావుగారు ప్రథమ శ్రేణి తెలుగు పండితులు. ప్రథమ శ్రేణి ప్రభుత్వ రీత్యానే కాదు. పాండిత్య రీత్యా కూడా. గళమెత్తితే తెలుగు పద్యం గగన గంగాఝురిలా ప్రవహిస్తుంది. కలమెత్తితే తెలుగు పద్యం మందాకినీ సౌంద

ర్యాలను ప్రకటిస్తుంది. భువన విజయాలలో, కవన విజయాలలో, కైలాసనాథ సభలలో, సరస్వతీ సామ్రాజ్యంలో, సాహిత్య సమ్మేళనాలలో వీరి పాత్ర సునిర్వచితంగాను - సుస్వర భరితంగాను సమయోచిత సద్యఃస్ఫూర్తి వన్మధుర వచోరిమలలో సాగుతుంటుంది.

రక్త నిష్ఠమైన భారతీయ సంప్రదాయం - సంస్కార నిష్ఠమైన వినయశీలం వీరి జీవన రేఖకు రెండు వైపుల అద్దిన బంగారు పుటంచులు.

శ్రీనివాస శతకం 'శ్రీనివాస' మకుటంతో సాగే ఆటవెలది పద్య సమాహారం; అష్టోత్తర శతం, సంకీర్తనా పరంగా ఉత్పల, చంపకాలు ఓ నక్షత్రమాల. ఆపై నివేదనా పంచకం. చివరకు ఆకాంక్షా సప్తకం.

అంటే ఈ పద్య సమాహారంలో 110, 27, 5, 7 సంఖ్యా విభాగాలున్నాయి. వెరశి 149 పద్యాలు. ఇవన్నీ యాదృచ్ఛికాలు కావు. ఒకానొక సంఖ్యా దేవతా ప్రేరక ప్రతి రూపాలు.

''సారహీన మైన - సంసార చక్రాన
తిరుగు చుంటి దారి - తెన్ను లేక
దారి జూపి బ్రతుకు - ధన్యమ్ము జేయుమో
దీన జన శరణ్య - శ్రీనివాస!!''

ఆర్తి... కవి తన స్థితిని స్వామికి సూటిగా నివేదించిన ఆర్తి. ప్రతి పదం దాని అర్థాన్ని మించిన పరమార్థాన్ని పలుకుతుంది. అలా పదాన్ని వాచ్యార్థంలోకాక, వ్యంగ్యార్థమునుగాక, పరమార్థంలో పలికించడం ఆధ్యాత్మకావ్యాల ప్రత్యేకత. దారి

- చక్రం - దారి చూపడం ఇవన్నీ మామూలు పదాలే. కానీ ఆధ్యాత్మిక సాధనా మార్గంలో అవి విశిష్టార్థ ప్రదాయకాలు. ఎవరి ఊహా పరిధి మేరకు వారికి అందులోని అర్థం ద్యోతక మౌతుంది.

ఈ పద్యం మరో ఉదాహరణ -

'దివిని భువిని వెదుక - దృక్కుల గనరావు
హృదయ కుహర మందు - నొదిగి యుండి
గారడీడు వోలె - కనుకట్టు గట్టెదు
చిత్ర చిత్ర గతుల - శ్రీనివాస!!'

మకుటానికి ముందు సంబోధించే తీరులో ఓ ప్రత్యేకత ఉంది. 'దీన జన శరణ్య' అని ఆర్తిలోను, స్వామి వారి గారడీని 'చిత్ర చిత్ర గతుల' అనీ అలాగే ప్రతి పద్యంలో స్వామిని సంబోధించే సంబుద్ధులన్నీ సార్థకంగా ఉండడం ఒక మంచి గుణం.

కేవలం ఛందస్సు కోసం దొరికిన పదాలు ఏరుకొని కూర్చడం కాదు. సాధారణంగా 'శతక రచన' అంటే మహా కావ్య రచన అనే పరీక్ష ఉత్తీర్ణత నందడానికి ముందుగా వ్రాసే ప్రవేశ పరీక్ష. కానీ ఈ కవి ప్రవేశ పరీక్షలోనే మహా కావ్య రచనకు చెందిన ప్రశ్నలన్నీ వ్రాసేశారు. ఈ పద్యం చిత్తగించండి!

'యాగ భాగ చయము - లారగించెడి దేవ।
బ్రతుకులోని యనుభ -వాల నిటుల
విన్నవించు కొంటి - వినయమింపెసలార
శ్రేయ మొనర జేయు - శ్రీనివాస!!'

వైదిక ధర్మసత్యాన్ని జీవనానుభవాలలో సమీకరించి స్వామిని వేడుకొనే తీరు ఎంతో సహజ సుందరంగా ఉంది.

ఇలాగే ఎన్నో పద్యాలు ఉట్టంకించవచ్చు. కానీ పాఠకుల ఊహావైశాల్యానికి వదిలేస్తున్నాను. ఆటవెలది వంటి జాతీయ ఛందస్సునేకాక అక్షరగణ ఛందస్సులైన ఉత్పల, చంపకములు గూడ వీరు బాగా నడిపించారు. చక్కటి ధార, చిక్కటి భావం, ఇంపైన పద విన్యాసం, ఆర్తి, ఆర్ద్రత, ఏకాగ్రమైన ధోరణి ఈ వృత్త సంకీర్తనంలో కనిపిస్తుంది. యతి, ప్రాసలను అలవోకగా దాటడం ముచ్చటేస్తుంది. పద్య రచనా నిర్మాణంలో మెళుకువలు వీరికి వెన్నతో పెట్టిన విద్యలా కనిపిస్తుంది.

'సారము లేనిదే యగు, విచారము జెందగ నేల తాము సం
సారము గూర్చి...'

ఈ పద్యధారలో యతి – ప్రాస ఎలా అమరాయో, సంస్కృత శ్లోకంలో యతి – ప్రాసల వద్ద ఆగడమే ఛందం. తెలుగు పద్యంలో యతి – ప్రాసల వద్ద ఆగకుండా సాగడమే అందం.

తెలుగు పద్యం ఈ శతాబ్దాంతంలో తిరిగి తన విశ్వ రూపాన్ని చూపుతోంది. తెలుగువాడి సాహిత్యపు శాశ్వతమైన చిరునామా పద్య సాహిత్యంలో ఉందని తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చింతలపాటి వారు పద్య విద్యాధరులు బయల్దేరారు. వారి పద్య శక్తి నిరంతరాయంగా కొనసాగాలని శ్రీనివాసుణ్ణి వేడుకొంటున్నాను. వీరి నుంచి ఒక గొప్ప కథా కావ్యాన్ని ఆశించడం అత్యాశ కాదనుకుంటున్నాను...

తెలుగు పద్య కవితాసతి నొసటన పూర్ణచంద్ర తిలకం దిద్దినట్లుంది శతకం. పఠించండి – తరించండి.

మచిలీపట్నం,

ది 20.12.1999. – రాళ్ళబండి కవితా ప్రసాద్.

డా॥ చింతా రామనాథం
ప్రిన్సిపాల్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం,
కూచిపూడి – 521 136.

'ఓమ్ నమో భగవతే శ్రీనివాసాయ నమః'

'వెన్నెల వంటిది శ్రీ వేంకటేశు మంత్రం' అంటాడు ప్రథమాంధ్ర సంకీర్తనాచార్యుడు తాళ్ళపాక అన్నమయ్య. కలుషిత వాతావరణంలో నైతిక విలువలు కర్పూరము వలె హరించుచున్న ఈ సమాజములో జీవించుట కష్టముగ నున్నది. కావున దీనికి దూరముగ శ్రీనివాసునకు దగ్గర ఉపవసించుచు శ్రీమన్నారాయణుని తలచుకొనుచు తరించుటకు వికలమైన మనస్సుతో ప్రార్థిస్తున్నాడీ శతక కర్త **చింతలపాటి పూర్ణచంద్రరావుగారు**. కళకళకొఱకు గాక కవిత్వ కళతో తనతోపాటు ఇతరులకు గూడ నొక ముక్తి పథాన్ని నిర్దేశించమని శ్రీనివాసునిణ్ణి ప్రార్థిస్తూ ప్రాథేయ పడుతున్నాడు. ఆత్మీయతను వెల్లడించు చున్నాడు.

ప్రాచీనాంధ్ర వాఙ్మయములో శతక వాఙ్మయము శతథా పండిత పామరులకు ప్రీతి పాత్రమైనది. కంఠస్థమైనది. ఈ శతక రచన నాధారముగ తీసుకొని కవి తన మనోగతాన్ని, అనుభవాన్ని శ్రీనివాసునికి నివేదిస్తూ ఈ సమాజ సమస్యలకు పరిష్కారాన్ని అర్థించుట సముచితముగ, సంస్తూయమానముగ నున్నది. ఇందులకు ప్రతి పద్యమునుదహరింపవచ్చును. ముఖ్యముగ పండిన హృదయము నుండి బాహిరిల్లిన ఆవేదన, ఆర్తి కవితా

రూపమును సంతరించుకొని శ్రీనివాసునకు ఆమకుటముతో నైవేద్యమొనర్చిన శ్రీ పూర్ణచంద్రరావుగారు అత్యంత అభినంద నీయులు, అభివందనీయులు.

ఇది చిత్రముగాదు - విచిత్రమును గాదు. పూర్ణచంద్రరావు గారి లాంటి వారి నుండి అస్మదాదులు అభిలషించు విధముగనే ఉన్నత భావాలకు భాషా రూపమిచ్చుట జరిగినది. ఇందులకు కారణము వారిది పండిత వంశము. పితృదేవులు శాస్త్రపారంగ తులు, కవిశేఖరులు, పండితరత్న బిరుదాంకితులు. తాతపాదులు భవిష్యద్వాణికర్తలు. ఇక మాతామహులు సంస్కృతాంధ్ర భాషా కోవిదులు, వైశ్వదేవ పరులు, శాస్త్రవిదులు. కావున పూర్ణచంద్ర రావుగారు అస్మదాదులకు ఆనందము నందించు రీతిలో శతక రచన గావించుటలో విశేషమేమున్నది. అది వారికి వెన్నతో బెట్టిన విద్య. కాగా రాబోయే కాలానికి కావలసిన శతకాన్ని, కాలదోష మంటని శతకాన్ని, సార్వకాలికము, సార్వజనీనమయిన శతకాన్ని అందించిన పూర్ణచంద్రరావుగారు బహుధా శ్లాఘనీయులు. వీరి కలము నుండి కలకాలము నిలిచే కావ్యాలు రావాలని ఆశించుట దురాశ కాదని యనుకుంటూ త్వరలోనే మంచి గ్రంథాలంది స్తారని ఆశిస్తూ...

కూచిపూడి, మిత్రుడు

ది. 14.12.1999. – **డాక్టర్ చింతా రామనాథం.**

వి. శరచ్చంద్రబాబు ఎం.ఎ.,
ప్రథమశ్రేణి తెలుగు పండితుడు
జిల్లా పరిషత్ హైస్కూల్,
పటమట.

అక్షర మందార హారం

ఆధునికాంధ్ర సాహితీ లోకంలో కుల మత సాంఘిక రాజకీయ నేపథ్యాలతో - ఆనాడు ప్రభవించిన అభ్యుదయ సాహిత్యోద్యమం మొదలుకొని, నేడు విస్తరిస్తున్న దళిత, స్త్రీవాద సాహిత్యోద్యమాల దాకా ఆ యా ఉద్యమాలను నిర్వహించే వారూ, ఆ నేపథ్యంలో కవిత్వం వ్రాసే వారూ పద్యాన్ని కాలం చెల్లిన ఒకానొక 'దురాచారం' అన్నట్లు చీదరించుకొనటం వల్లా, అంటరానిదీ, అనాగరికమూ అన్నట్టు 'రోత'గా చూడటం వల్లా - ఈనాటి యువ కవులు పద్యాలు వ్రాయటానికి ఇష్ట పడటం లేదని భావించవచ్చు. అంతేకాదు. ప్రాచీన సాహిత్యాన్ని డొక్కశుద్ధిగా చదువుకుని, ఛందోవ్యాకరణాదులు చక్కగా నేర్చుకొని, సలక్షణంగా పద్యం వ్రాయగలిగిన కొందరు కిందటి తరం కవులు కూడా పద్యాన్ని వదిలేసి వచన కవితా ప్రక్రియను వరించటం శోచనీయం.

కొన్ని శతాబ్దాలపాటు ఏకైక కవితా ప్రక్రియగా తెలుగు సాహితీ సామ్రాజ్యాన్నేలిన పద్యాన్ని పక్కకు నెట్టేసి వచన కవితా ప్రక్రియ ఆ స్థానాన్ని ఆక్రమించుకున్నది అనటంలో అతిశయోక్తి లేదు.

కాకపోతే ఆకాశవాణి సమస్యాపూరణ కార్యక్రమంలోనూ, అడపాదడపా ఏ పండక్కో పబ్బానికో ఏవో కొన్ని పత్రికల్లోనూ, పద్య కవితా ప్రక్రియే ప్రాధాన్యం వహించే అవధాన సభల్లోనూ మాత్రమే పద్యం ఈనాడు తన ఉనికిని చాటుకుంటున్నది. తెలుగు వారి ప్రత్యేకతలలో ఒకటిగా చెప్పుకోతగిన పద్యం ఆదరణ కోల్పోయి, చివరికి ''ప్రాచీన సాహిత్య శిలాజం''గా మాత్రమే చరిత్ర పుటల్లో దర్శనమిచ్చే దయనీయ స్థితి భవిష్యత్తులో కలగకుండా ఉండాలని పద్యాన్ని అభిమానించే వారంతా కోరుంటున్నారు.

ఇలాంటి నిరాశా పూరితమైన వాతావరణంలో చివరి దశలో మినుకు మినుకు మంటున్న పద్య దీపాన్ని ఎగదోసి కవితా స్నేహం పోసి మళ్లీ జాజ్జ్వల్యమానం చేయాలనీ, తెలుగు సరస్వతి ఆలయంలో అఖండ దీపంగా నిలపాలనీ యథాశక్తి కృషి చేస్తున్న వారు అవధాన కవులూ, శతక కవులూను.

అష్ట, శత, సహస్ర, మహాసహస్రాది అవధానాలతో పల్లెల నుండి పట్టణాల దాకా పద్యాన్ని పల్లకీ ఎక్కించి ఊరేగిస్తున్నారు. ఆంధ్రదేశం నుండి అమెరికా దాకా అవధానాలు నిర్వహిస్తూ తెలుగు పద్యపు పరిమళాలను దశదిశలా గుబాళింపజేస్తున్నారు – అవధాన కవులు.

ఇక శతక కవులూ పద్యాన్ని అక్షయంగా అక్షరంగా నిలపటానికీ, తెలుగు పద్యపు తరితీపులు రుచి చూపటానికీ తమ వంతు కర్తవ్యం తాము నిర్వర్తిస్తున్నారు.

అవధానం శ్రావ్యమై మానసికానందాన్ని కలిగిస్తుంటే, శత

కాలు అక్షరబద్ధమై ఆత్మానందాన్ని అందిస్తున్నాయి. కాబట్టి ఈనాడు పద్య కవితా పారిజాతాలు విరబూయాలని కోరుకునే సాహితీ ప్రియులు అవధాన కవుల్నీ, శతక కవుల్నీ ప్రోత్సహించ వలసిన అవసరం ఎంతైనా ఉంది.

శతకాలు సాధారణంగా రెండు రకాలుగా కన్పిస్తాయి. భక్తి శతకాలూ, నీతి శతకాలూను. సంస్కృతంలో భర్తృహరి ఒకడు మాత్రం నీతి, శృంగార, వైరాగ్య శతకాలు వ్రాశాడు. మరే శతక కవీ ముఖ్యంగా తెలుగు శతక కవులెవరూ భక్తినీ నీతినీ విడిచి మరో భావాన్ని ఆశ్రయించినట్లు కనిపించదు. అయితే ఆధునికు లలో అక్కడక్కడా పకోడీ శతకం, పిల్లి శతకం లాంటివి హాస్యమూ, అధిక్షేపమూ మొదలైనవి ప్రధానంగా కన్పించినా వాటి పరమార్థం కూడా సామాజిక నీతిని ఉద్బోధించటమే అన్నది ఫలితార్థం కావటం విశేషం. ఏతావతా ఆత్మోద్ధరణే పరమ లక్ష్యం గా సాగే కృష్ణ శతకం, సూర్య శతకం లాంటివి భక్తి శతకాలూ, సామాజిక సంస్కారం పరమోద్దేశంగా సాగే సుమతీ శతకం, వేమన శతకం లాంటివి నీతి శతకాలూ అని శతకాలు ముఖ్యంగా రెండు రకాలుగా విభజించుకోవచ్చు. అయితే కవి ఎంత భక్తు డయినా సమాజంలో నివసించే మానవుడే కాబట్టి సామాజిక సమస్యలు అతన్ని చుట్టుముట్టినప్పుడల్లా తాను నమ్మిన భగవంతుడితో మొరపెట్టుకుంటాడు. ఈ మనుషుల వింత మనస్తత్వాలను గురించీ, మంచి చెడులను గురించీ, ఈ సమాజంలో జరుగుతున్న అవకతవకలను గురించీ, కుల మత సాంఘిక ఛాందస భావాలను గురించీ – ఒకటేమిటి తన మనసు స్పందించినప్పుడల్లా ఒక పద్యం ద్వారా తన స్వామికి నివేదించు

కుంటాడు. అలా స్పందించి చెప్పిందే ధూర్జటి మహాకవి శ్రీకాళహస్తీశ్వర శతకం. ఇలాంటివి మూడవ తరహా శతకాలు. ఈ కోవకు చెందిందే ఈ శ్రీనివాస శతకం.

ఈ శ్రీనివాస శతకాన్ని రచించిన శ్రీ **చింతలపాటి పూర్ణచంద్ర రావు** కవి పండిత వంశంలో జన్మించారు. వీరి జనకులు **'పండితరత్న' కీ॥శే॥ చింతలపాటి లక్ష్మనరసింహశాస్త్రి**గారు. వీరు సంస్కృతాంధ్ర హిందీ భాషల్లో మహా విద్వాంసులు, కవి వతంసులు. **కూచిపూడి - భాగవతులు, జ్ఞానవాశిష్ఠము, గొల్లకలాపము, త్రిస్కంధ జోతిష్యము** అముద్రితము వంటి ప్రామాణిక గ్రంథాలు వెలువరించిన పరిశోధకులు. ఆస్తిపాస్తుల సంగతేమోకానీ వారు తమ జీవితమంతా సాధన చేసి సంపాదించిన విద్యా ధనాన్ని తన కుమారులకు రెండు చేతులా పంచి యిచ్చిన మహామనీషి. పూర్ణచంద్రరావు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల, తిరుపతిలో శ్రీవేంకటేశ్వరుడి పద సన్నిధిలో విద్యాభ్యాసం సాగిస్తూన్న నాటి నుండి దీక్షగా కొనసాగిస్తున్న కవితా వ్యవసాయానికి సాయంగా పిత్రార్జితంగా లభించిన పాండితీ విభవం దోహదం కాగా పండిన పంట ఎంతో ఉంది. అందులో కొంత భాగం మాత్రం కోసి, నూర్చి, రాజనాల రాశిపోశాడు. ఆ రాజనాల రాశే ఈ శ్రీనివాస శతకం.

ఈ కవి నీతినీ భక్తినీ విత్తనాలుగా చల్లి పద్యాలు పండించాడు. ప్రసన్నత, భావ సమగ్రత, సార్వజనీనత ఈ శతకాన్ని ఉత్తమ స్థాయికి చేర్చాయి.

కవిని బ్రహ్మతో పోలుస్తారు - కావ్యలోకాన్ని సృష్టిస్తాడనే కాదు

– అతడు చతుర్ముఖుడని కూడా. కవిలో ఒక పరిశీలకుడూ, ఒక విశ్లేషకుడూ, ఒక బోధకుడూ, ఒక తాత్త్వికుడూ దాగి ఉంటాడు. ఆ నాలుగు లక్షణాలూ పరిపక్వత చెందిన కవి ఋషి.

శ్రీనివాస శతకంలో కవి నాలుగు ముఖాలూ కన్పిస్తాయి. వాటి పరిపక్వస్థితి కూడా గమనిస్తాము.

ఉన్నవాడెపుడును – ఉన్నవాడికె బెట్టు
లేని వాడి కిడడు – లేశమైన
ఉర్విలోని జనుల – ఉపకార భావాల
శీలమిట్టులుండె – శ్రీనివాస! – అని నిట్టూర్చుతాడు కవి.

ఉన్నవాడూ ఉన్నవాడికే పెడతాడు, లేనివాడూ ఉన్నవాడికే పెడతాడు – అని లోకోక్తి. కానీ పరిశీలించి చూస్తే మాత్రం ఉన్న వాడు ఉన్నవాడికి పెట్టటమొక్కటే నిజం. లేనివాడు ఉన్నవాడి చేత దోచుకోబడతాడు. ఉన్నవాడు లేనివాణ్ణి దోచుకుంటూనే వాడికేదో ఉపకారం చేస్తున్నట్టు నటిస్తాడు. ఇది సమాజ సమ్యక్ పరిశీలన వల్ల కవి తెలుసుకున్న నిజం!

విశ్లేషణ

వ్యసన పరుని జూచి – పరిహసించిరి నాడు
వ్యసన పరుడె నేడు – భవ్యగుణుడు
మంచి చెడ్డలన్ని – మదిలోని మార్పులె
శ్రీరమా విలోల – శ్రీనివాస!

వ్యసనపరుణ్ణి ఆనాడు పరిహసించారు. ఈనాడు భవ్యగుణు డని గౌరవిస్తున్నారు. ఆనాడెందుకు పరిహసించారు? ఈనాడెందు

కు గౌరవిస్తున్నారు? ఇది మంచి ఇది చెడు అని నిర్ణయించేది బుద్ధి. ఆ బుద్ధి ఆలోచించే విధానంలో వచ్చిన మార్పే మంచిని చెడుగాను, చెడును మంచిగాను చూపిస్తుంది.

ప్రబోధం

ధనము కూడ బెట్టు – తలపు మంచిదె కాని
ధర్మమార్గ మెపుడు – తప్పరాదు.
పరుల నోళ్ల గొట్టి – పైకంబు గడియించు
చెనటికేమి శిక్ష – శ్రీనివాస!

ధనమూల మిదం జగత్. కాబట్టి ధనం సంపాదించాలి. ధన సంపాదన తప్పుకాదు. కాని ధన సంపాదన కోసం ధర్మ మార్గం తప్పటం తప్పు. కాబట్టి ధర్మ సమ్మతమైన పద్ధతిలోనే ధనం సంపాదించాలి. పరుల నోళ్ల కొట్టి తన ఇనప్పెట్టె నింపుకొనే చెనటికి తగిన శిక్ష దైవమే విధిస్తాడు!...

తత్త్వం

అణువు నణువులోన – నణగి యుండెడి నిన్ను
త్రికరణాలవలన – తెలుసుకొనిన
చావు పుట్టు కనెడి – జంజాటమును లేక
జీవి ముక్తి పొందు – శ్రీనివాస!

అణువు అణువులో నిండి ఉన్న భగవంతుణ్ణి మనసా వాచా కర్మణా ఆరాధించి దర్శించిన పుణ్యాత్ముడు సంసారపు జంజాటం నుండి విముక్తుడై మోక్షాన్ని పొందుతాడు. ఇలా కవి చతుర్ముఖత్వం శతకమంతటా గోచరిస్తుంది. స్థాలీపులాక

న్యాయంగా నాకు తోచిన నాలుగైదు పద్యాలే ఇక్కడ చూపటం జరిగింది. శతకమంతా వివరించి చూపడం సాధ్యం కాదు కదా!

పరిపక్వత

జన్మ జన్మలందు – సత్సంగ మిమ్మంచు
వేడుకొందు నెపుడు – విమల చరిత
కోరబోను నిన్ను – గొంతెమ్మ కోరికల్
శేషశైలవాస – శ్రీనివాస!!

ఇది పరిపక్వదశ. ఈ విధంగా అర్థ కామాలను త్యజించి నప్పుడే మనిషి మహర్షిగా రూపొందుతాడు. 'నానృషిః కురుతే కావ్యం' కావ్యం వ్రాయటానికి ఋషిత్వ సిద్ధి పొందాలి. పూర్ణచంద్రరావు కి ఋషిత్వం సిద్ధించింది. అంటే అతను గడ్డాలు పెంచుకుని కాషాయాలు ధరించి కారడవులకు వెళ్లి ఘోర తపస్సుకు పూనుకున్నాడనీ కాదు, లోకాతీత, మానవాతీత శక్తులేవో సంపాదించాడనీ కాదు. భావనాపరమైన పరిపక్వత పొంది కావ్య రచనకు అర్హత సంపాదించాడని అర్థం. ఆ అర్హతతో అతను కావ్య రచనకు పూనుకుని ఉత్తమ కావ్యాలు వెలయిస్తాడని ఆశిద్దాం.

– ద్వితీయ భాగం –

శ్రీనివాస శతకంలో ద్వితీయ భాగంగా వృత్త సంకీర్తనమ్ చేర్చారు. కవి ఆటవెలదులలో ఎంత తేటతేట కవితల్లల్ల గలడో శ్రీనివాస శతకంలో చూస్తాం. వృత్త రచనలో కవి వృత్త విన్యాసం ఈ విభాగంలో గమనిస్తాం.

ఇందులో నివేదన, వేంకటేశ్వర నక్షత్రమాల, ఆకాంక్ష అనే

శిక్షకలున్నాయి. నివేదన 'ఆరాధన' మాసపత్రికలోనూ, వేంకటేశ్వర నక్షత్రమాలిక 'సప్తగిరి' మాసపత్రికలోనూ, ఆకాంక్ష 'ముముక్షువు' మాసపత్రికలోనూ లోగడ ప్రచురించ బడ్డాయి. ఇవేకాక శ్రీనివాస శతకంలోని పద్యాలన్నీ కూడా లోగడ 'ఆరాధన' మాసపత్రికలో ప్రచురిత మైనవే.

నివేదన, ఆకాంక్ష, శ్రీకృష్ణ భక్తి పూరితాలు. మధుర భక్తి సంప్రదాయానికి చెందిన రచనలు.

ఎప్పటికప్పుడే హృదయమిచ్చి భజింతును, నన్ను జూడకే
త్రుప్పు చరించు చుందు విది ధర్మమె? నీ హృదయాంబుజాత మం
దెప్పటికైన నీ జనుని నేలెడి కోర్కె జనించునేమొ? యం
చొప్పుగ నాస బూని యిటులుంటి గదా! దయజూడరాగదే!

ఇలా మధుర మధురంగా సాగిపోతాయి పద్యాలు.

శ్రీ వేంకటేశ్వర నక్షత్రమాల భావ శబల. భక్తి, నీతి లోకరీతి, ఆత్మ విమర్శ మొదలైన అనేక భావాలిందులో చోటు చేసుకున్నాయి. భాష భావము పోటీ పడి ఝురీధారలై ఉరికిన వృత్త నర్తన మిది. మచ్చుకొక పద్యం రుచి చూడండి.

కొలిచిన నీదు రూపము నకుంఠిత భక్తి గుణంబు గల్గు, తా
తలచిన నీదు నామము సుధారస వాహిని ముంచి యెత్తు, వే
నిలిపిన నీదు తేజము వినిర్మల విద్యలు బోధ జేయునో
కలియుగ దైవమా! పరమ కారుణికోత్తమ! వేంకటేశ్వరా!

శ్రీనివాస శతకంతోబాటు ద్వితీయ భాగంగా ఈ వృత్త సంకీర్తనం చేర్చి ముద్రించటం ఎంతో యుక్తంగా ఉంది. పద్య

కావ్యాలు పూజ్యమైన ఈ రోజుల్లో ఆ కొరతను తీరుస్తూ ఇలాంటి గ్రంథాలు విరివిగా రావటం పద్య ప్రియులకు సంతోషం కలిగిస్తుందని చెప్పడంలో సందేహం లేదు. ఈ గ్రంథాన్ని ప్రచురించిన మిత్రుడు పూర్ణచంద్రరావుకు ధన్యవాదాలు.

నా సహాధ్యాయి విబుధుడు నా సఖుండు
తేట పలుకుల చింతలపాటి పూర్ణ
చంద్ర సుకవికి అభివాద చందనాలు
అక్షరామూల్య మందార హారములును

59 ఎ-13-36,

ఓల్డు పి. అండ్ టి. కాలనీ,

పటమట, విజయవాడ,

ది. 26.8.1999. — ***వేదాంతం శరచ్చంద్రబాబు.***

'భాషాప్రవీణ'

పి. హనుమంతరావు, ఎం.ఏ., ఎం.ఇడి.,

తెలుగు పండితుడు, జి.ప. ఉన్నత పాఠశాల,

కంభంపాడు.

'శ్రీనివాస' మకుట సుశోభితమైన బ్రహ్మశ్రీ చింతలపాటి పూర్ణచంద్రరావు గారి 'శ్రీనివాస శతకము' నామూలాగ్రముగఁ బఠించితిని.

అష్టోత్తర పద్య సమన్వితమైన యీ శతకమున కనుబంధముగ 'నివేదన, వేంకటేశ్వర నక్షత్రమాలిక, ఆకాంక్ష' యను విభాగములతో వృత్త సంకీర్తనమున్నది.

శతకమును తేట తెలుగున ఆటవెలదులలో రచించిన వీరు, వృత్త సంకీర్తనమున రసవంతమగు సంస్కృత సమాసములను వాడియున్నారు. ఈ కవి సంస్కృతాంధ్ర భాషా విశారదులని జెప్పుట కింతకంటె నిదర్శనమేమి గావలెను!

తనకు భగవంతునిపై గల మధుర భక్తిని జాటుకొనుటయే గ్రంథ పరమార్థమని యెంచక స్వానుభవముతో నేటి సాంఘిక పరిస్థితులను గూడ కన్నులకు కట్టినట్లు వివరించుట ద్వారా ఈ కవివరేణ్యులు సంఘ సంస్కరణకు గూడ సాహసించి యున్నారనుటలో సందియము లేదు.

కలుములమ్ము వడిని – కరగిపోయెడివేళ
మనమునందు నన్ను – మరువ కుండ

పచ్చబొట్టు పగిది - వదనాన ధరియించు
దీనజన శరణ్య! - శ్రీనివాస!!

రామమంత్రమెపుడు - రక్షయై చెలువారి
పాపబుద్ధినెల్ల - పారద్రోలు
నామభజన సేయు - నరుల నాలుకకది
చెఱకు రసముగాదె - శ్రీనివాస!

ముచ్చటైన పై రెండు పద్యములును ఈ కవి పండితుని భక్తికి మచ్చు తునకలు.

కాలు జారెనేని - కాయమ్ము గాయమౌ
నోరు జార మనసు - నొచ్చుకొనును
జారు పాటులున్న - జరుగు బాటుండునా!
క్షితిని యేరికైన - శ్రీనివాస!

తేట తెలుగులో మేటి భావములను సూటిగా చదువరుల హృదయములకు నాటుకొనునట్లు రచన చేయుటలో నీ కవి దిట్టయని పై పద్యము చెప్పక చెప్పుచున్నది.

కులము మతములంచు - కుమ్ములాటలు రేపు
కుటిల వర్తనమ్ము - పొటమరింప
దానవత్వమిలను - తలయెత్తి జనతకు
చేటు తెచ్చు చుండె - శ్రీనివాస!

ఈ కవి కుల మతాల కుమ్ములాటను వ్రేలెత్తి జూపి, సాంఘిక దురాచారములను నిర్మోగమాటముగ తూర్పారబట్టెడి

సంస్కరణవాది. వ్యవహార వేదియని జెప్పుటకీ పద్యమొక యుదాహరణము. ఇట్టి పద్యములీ శతకము నందనేకము.

మొత్తము మీద కేవలము భక్తియే పరమార్థమని యెంచక, సంఘ సంస్కరణ దృష్టితో గూడ వ్రాయబడిన ఈ శతక మిహ పరసాధకము. లలిత పద సంశోభితము. విజ్ఞాన దాయకమునై నట్టిది. ఇట్టి గ్రంథ రాజమును పాఠకలోకమున కందించ సమకట్టిన శ్రీ పూర్ణచంద్రరావుగారికివే నా నమోవాకములు.

తిరుమల గిరివాసుడైన శ్రీ వేంకటేశ్వరుడీ కవి మనోరథము నీడేర్చు గాత!

కంభంపాడు,

ది. 26.12.1999. **– వి. హనుమంతరావు.**

కృతజ్ఞతలు.

ఆంధ్ర వాఙ్మయంలో శతకాలకు ఒక విశిష్ట స్థానం ఉంది. విషయ వివరణను బట్టి వివిధ రకాలుగ వింగడింపబడిన ఈ శతకాలు పఠితలకు చిత్తశాంతిని, హృదయాహ్లాదాన్ని కలిగిస్తున్నా యనడం అత్యుక్తి గాదు. వీనిలో భక్తి శతకాలు, అందునా ఆర్త భక్తి శతకాలు అశేష ప్రజాదరణను పొందాయి. కష్టాలు కలిగి నప్పుడు వాటి నివారణ కోసం భగవత్ప్రార్థన చేయటమే ఆర్తభక్తి. కలియుగంలో భగవన్నామస్మరణ సమస్త భవరోగాలకు దివ్యౌషధమని, భగవదనుగ్రహమే ప్రాణికి ప్రధానమని, భగవత్సేవాదికం వలన మోక్షం కలుగుతుందని పెద్దల అభిప్రాయం. అందుకు అనుగుణంగా వ్రాయబడినవే ఆర్త భక్తి శతకాలు. ఆ కోవకు చెందే విధంగా ఉండాలన్న భావనతో చేసిన చిన్న ప్రయత్నమే ఈ ''శ్రీనివాస'' శతక రచన. ఈ కృతి కర్తృత్వంలో నేను ఎంతవరకు సఫలీకృతుడనయ్యానో సహృదయులే నిర్ణయించాలి.

బాధాతప్త హృదయంతో జీవితం వేగిపోతున్న తరుణాన నా మానసిక వేదనను వేంకటేశ్వరునకు నివేదించుకున్నా వృత్త పద్యాలలో. అవి 'సప్తగిరి' మాసపత్రికలో ప్రచురింపబడ్డాయి. వాటిని మా గురువర్యులు శ్రీ ఘంటా వేంకట్రామయ్యగారు చూచి అభినందించారు. జన సామాన్యానికి అర్థమయ్యే రీతిలో 'ఆటవెలది' ఛందంతో గూడ వ్రాయుమని ఆదేశించారు. వారి ఆదేశ ఫలమో? లేక వారి ఆశీర్వాద బలమో? కాక భగవదను

గ్రహమో? తెలియదు కానీ 'శ్రీనివాస' మకుటంతో 'ఆటవెలది' ఛందంలో శతక రచన ప్రారంభించా. వ్రాసిన పద్యాలను ఎప్పటి కప్పుడు 'ఆరాధన' మాసపత్రికకు పంపగా వారు వరుసగా ఎనిమిది సంచికలలో ఆ పద్యాల్ని ప్రచురించారు. వానిని చూచి మా గురువులు ఆనందపడ్డారు. వారు పదవీ విరమణ చేయు నాటికి అర్థ శతం మాత్రం వ్రాయగలిగా తరువాత శతక రచన కుంటుపడింది. రచన అసంపూర్తిగ ఉండటం వలనగానీ, లేక గ్రహస్థితి అనుకూలించక పోవటం వలన గానీ జీవితంలో మరల మరిన్ని క్లిష్ట సమస్యల్ని ఎదుర్కోవలసి వచ్చింది. పర్యవసానంగా పెడన మండలం, పెనుమల్లి గ్రామమందు ఉన్న ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యాను. ఇచ్చటి ఉపాధ్యాయ బృందం ఇచ్చిన ప్రోత్సాహంతో కొద్దిపాటి సామాజిక స్పృహను కవితలో రంగరించి శతక రచనను పూర్తి చేసి భగవదర్పితం చేశా. నా యీ శతక రచనకు నాంది పలికిన గురుదేవులకు, శతక రచన పూర్తి కావటానికి ప్రోత్సాహ పరచిన మా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందానికి నా హృదయ పూర్వక ధన్యవాదములు.

శతక ముద్రణకు ఆర్థిక సహాయ మందించిన తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి వారికి, 'సప్తగిరి, ఆరాధన, ముముక్షువు' మాసపత్రికలలో ప్రచురింపబడిన పద్య ఖండికల్ని, శతకానికి అనుబంధంగా పొందు పర్చుకోవడానికి అనుమతించిన ఆ యా పత్రికాధిపతుల సౌజన్యానికి, శతక

ముద్రణకు తక్కువైన సొమ్మును సాహిత్యాభిమానంతో అందించిన బ్రహ్మశ్రీ డా॥ భాగవతుల పూర్ణచంద్రరావు (కూచిపూడి) గారి వదాన్యత కు, గ్రంథావిష్కరణకు కావలసిన ద్రవ్యాన్ని అందించగలనని వాగ్దానం చేసిన దాన గుణమణి శ్రీమతి తూములూరి రోహిణి (అమెరికా) గారికి నా మనః పూర్వక కృతజ్ఞతాభివందనములు.

శతకాన్ని ఆసాంతం పరిశీలించి తమ అమూల్యమైన అభిప్రాయాల్ని వ్రాసి ఇచ్చిన హైదరాబాదు విశ్వవిద్యాలయం రిటైర్డు తెలుగు ప్రొఫెసర్ శ్రీ **ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం**, తిరుమల తిరుపతి దేవస్థానం-తిరుపతి, ధర్మ ప్రచార పరిషత్ మాజీ కార్యదర్శి శ్రీ **సముద్రాల లక్ష్మణయ్య**, అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్, సహస్రావధాని శ్రీ **మేడసాని మోహన్**, సరస్వతీ కంఠాభరణ **డా. ప్రసాదరాయ కులపతి**, అవధాన విద్యా వాచస్పతి శ్రీ **రాళ్ళబండి కవితా ప్రసాద్**, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి నాట్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ **చింతా రామనాథం**, నా సహోధ్యాయుడు శ్రీ **వేదాంతం శరచ్చంద్రబాబు**, నా సోదరుడు **పి.హనుమంత రావు**గారలకు, నా యీ రచనా వ్యాసంగానికి తమ అమూల్యమైన సలహాలందించిన కవి పండితులకు నా మనః పూర్వక కృతజ్ఞతాంజలులు.

రచనా విషయంలోనే కాక గ్రంథ ముద్రణ విషయంలోనూ అలసత్వం వహిస్తున్న నా సోమరితనాన్ని పారద్రోలి నన్ను

ముందుకు నడిపిస్తూ పుస్తక ప్రచురణ బాధ్యతను స్వీకరించి తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించిన నా సోదరుడు చిరంజీవి చింతలపాటి వేంకటేశ్వరస్వామికి నూతన సహస్రాబ్ది శుభాశస్సులు.

'దైవం మానుష రూపేణ' అన్నట్లు ఆ శ్రీనివాసుడు ఇందరిలో ప్రవేశించి నా శతకం వెలుగు చూడటానికి దోహదకారులగుట నా పురాకృత సుకృత విశేషంగా భావిస్తున్నా. చదువరులు ఈ శతక మందలి గుణ దోషాల్ని, 'క్షీరనీర న్యాయం'గా పరిశీలించి, పఠించి సహృదయతతో ఆశీస్సులందిస్తారని అభిలషిస్తున్నా.

'ఎందరో మహానుభావులు - అందరికీ వందనాలు'

ఇట్లు

పెనుమల్లి,
ది. 15.1.2000.

బుధజన విధేయుడు
– **చింతలపాటి పూర్ణచంద్రరావు**





విషయ సూచిక

1. శ్రీనివాస శతకము

2. వృత్త సంకీర్తనము

-. శ్రీ వేంకటేశ్వర నక్షత్రమాలిక

2. నివేదన

3. ఆకాంక్ష

శ్రీనివాస శతకము



శ్రీగణాధినాథు – సేవించి తొలుదొల్త
శతక రచన సేయ – సాహసింతు
లలిత భావజాల – మలరారునట్లుగా
చిత్తశుద్ధి నిడుము – శ్రీనివాస!! 1

పలుకులమ్మ పాద – పంకేరుహమ్ములన్
మనమునందు దలతు – ఘనముగాను
హృద్యమైన పద్య – మెదలోన తళుకొత్తు
చింతనమ్ము నిమ్ము – శ్రీనివాస!! 2

తెనుగు భారతి నిల – తీర్చి దిద్దిన యట్టి
నన్నయాది కవుల – సన్నుతించి
వారి బాటలోన – పయనించునట్లుగా
జ్ఞానదీపమిడుము – శ్రీనివాస!! 3

మధురభక్తి చేత – మాధవైక్యమయిన
భక్తకోటి కేను – ప్రాంజలించి
మనసులోని మాట – వినిపింప దొరకొందు
సింధు శయన వినుము – శ్రీనివాస!! 4

శ్రీసతీమ తల్లి – చిరునవ్వు చిందింప
పరవశించునట్టి – పరమ పురుష
పద్య కవిత చేత – పండించి గుండెను
చేరి కొందు నిన్ను – శ్రీనివాస!! 5

శ్రీగలాడవంచు – సేవించు జనతకు
కామితార్థమిడెడి – కల్ప భూజ
కరుణతోడ మమ్ము – కాపాడు చుండుమా
శిరము వంచి కొల్తు – శ్రీనివాస!! 6

శ్రీవరాహమూర్తి – సీమలో నెలకొన్న
నిరుపమాన రూప – నిర్వికార
భక్తి భావ మొసగి – భవ బంధములు త్రుంచు
చిరయశో విశాల – శ్రీనివాస!! 7

కమల నయన నీదు – కడగంటి చూపులు
మూడు జగము లేలు – మురిపె మలర
భద్ర కరములైన – భవదంఘ్రి యుగ్మంబు
శ్రీకరంబు మాకు – శ్రీనివాస!! 8

మంద మంద హసిత – సుందర వదనంబు
హృదయ పద్మ మందు – సుధను నింప
కూర్మి మీర తలతు – గోవింద నామంబు
శ్రేయ మొనర జేయు – శ్రీనివాస!! 9

వేంకటాద్రిపైన – సంకట హరుడవై
వెలసియున్న నిన్ను – వేడ్క మీర
వేయి నోళ్ళనైన – వినుతింప తరమౌనె
చిన్మయ స్వరూప – శ్రీనివాస!! 10

సప్త శైలశృంగ – సామ్రాజ్య నేతవై
భూత తతిని సాకు – పుణ్యమూర్తి
సహన శక్తి నిచ్చి – శాంతిని సమకూర్చి
చెంత జేర్చి కొనుము – శ్రీనివాస!! 11

కష్ట సమయమందు – గళమెత్తి పిలువగా
పరువు పెట్టి వచ్చి – ప్రజల గాచు
దైవమనిన నీవె – ధారుణీ తలమందు
శేషశైలవాస – శ్రీనివాస!! 12



కనులజూచు నీదు – కళ్యాణ రూపంబు
కలుష హారి యగుచు – కలిమి గూర్చు
చెవిని సోకు నీదు – శృంగార కీర్తనల్
జీవితాశ నెఱపు – శ్రీనివాస!! 13

రత్న మకుట కాంతి – రాగ రంజిత మౌచు
తిరుమలాద్రి పైన – తేజరిలగ
కవుల మనసులందు – కదలాడు భావాలు
తేనె వాకలట్లు – శ్రీనివాస!! 14

మాయ జాలమెల్ల – మంత్ర ముగ్ధుల జేయ
పరమ యోగులైన – భ్రమయుచుంద్రు
ఆరణేయు జన్మ – కాధార మదిగాదె
చిన్మయాంతరంగ – శ్రీనివాస!! 15

పాప పుణ్య కర్మ – ప్రారబ్ధ విభవమ్ము
కాల గమనమందు – కట్టు గట్టి
జనన మరణ దుఃఖ – మనుభవింపగ జేయు
శిక్షకుండ వీవె – శ్రీనివాస!! 16

ఏడు కొండలందు – ఎక్కడో గుడిలోన
వెలసి యున్న నిన్ను – పలుకరింప
కనులు మూసి పెదవి – కదుప వేమయ్యా? నా
చెలిమి సేయగదవె – శ్రీనివాస!! 17

సారహీనమైన – సంసార చక్రాన
తిరుగుచుంటి, దారి – తెన్ను లేక
దారి చూపి బ్రతుకు – ధన్యమ్ము జేయుమో
దీన జన శరణ్య – శ్రీనివాస!! 18

వికలమయ్యె మనసు – వేవేల రీతుల
విప్పి చెప్పరాని – విధముగాను
మనసు కుదుట బడెడి – మంత్రమ్ము బోధించి
చింత దీర్చు మయ్య – శ్రీనివాస!! 19

జన్మ జన్మలందు – సత్సంగ మిమ్మంచు
వేడి కొందు నెపుడు – విమల చరిత
కోరబోను నిన్ను – గొంతెమ్మ కోరికల్
శేషశైల వాస – శ్రీనివాస!! 20



సర్వ జగతి నేలు – సార్వభౌముడవని
శరణు జొచ్చినాడ – దురిత దూర।
కరుణతోడ నాదు – కళవళమ్ముమను బాపి
చిత్త శాంతి నిడుము – శ్రీనివాస!! 21

తమము నణచి వేయు – దరహాస చంద్రికల్
విశ్వమెల్ల పరచి – వేడ్కతోడ
సప్తగిరులపైన – చక్కగ నెలకొన్న
శీతకరుడ వీవె – శ్రీనివాస!! 22

పరిమళాల నీను – విరుల దండలు నీదు
గళము నందు వేయ – కాంక్ష గలదు
కామితంబు దీర్చి – కరుణించవే నన్ను
శ్రీకళా విలాస – శ్రీనివాస!! 23


నామ రూపములను – నరులు కల్పన జేసి
మురిసి పోవుచుంద్రు – పుడమిలోన
పేరు నూరులున్న – నోరేల లేదయా
జీవ శిల్పమైన – శ్రీనివాస!! 24

దివిని భువిని వెదుక – దృక్కుల గనరావు
హృదయ కుహర మందు – నొదిగి యుండి
గారడీడు వోలె – కనుకట్టు గట్టెదు
చిత్ర చిత్ర గతుల – శ్రీనివాస!! 25

మౌని వరుల వోలె – కాననంబుల కేగి
జపము తపము సల్ప – శక్తిలేదు
మనసు నందు నిన్ను – ఘనముగ తలచుచు
సేవ జేసి కొనెద – శ్రీనివాస!! 26

వాడి పోవు వఱకు – వాసన వెదజల్లు
పూవు వోలె బ్రతుకు – పాసగజేసి
నేల బడక మునుపె – నీ యున్కి గమనించు
రీతులెల్ల దెల్పు – శ్రీనివాస!! 27

పరమ పాపియైన – శిరముపై కరమెత్తి
నీకు మొక్కెనేని – నిశ్చయముగ
చిక్కులన్ని దీర్చి – చిర్నవ్వన చేయిచ్చి
చేది కొందువయ్య – శ్రీనివాస!! 28



దేహ మందు వెల్గు - దీపపు ప్రమిదలో
ఆయువనెడి చమురు - పోయుచుండి
అంకురించు ప్రాణు - లన్నింట తోతెంచు
చేతనత్వ మీవె - శ్రీనివాస!! 29

ఎదుటి వారి యెడద - నొదిగిన భావాల
నెరుగ శక్యమౌనె - యేరికైన
హృదయ మర్మమరయ - సదయుండు గావలె
శ్రితజన పరిపాల - శ్రీనివాస!! 30

అభయ హస్తమొసగి - యాదరించు మనగ
గతము తడుముదేల - గరుడ గమన।
ఆశ్రయించు జనత - కండ దండలు గావె
శేషగిరి నివాస - శ్రీనివాస!! 31

ఎల్ల పనులు మాని - ఏకాగ్ర చిత్తాన
సత్య శోధనమ్ము - సలుపు చుండ
సతియు సుతుల తోడ - సాధన కుదురక
చిక్కు శల్యమైతి - శ్రీనివాస!! 32

గోకులంబు బ్రోవ - గోవర్ధనంబెత్తి
కొదమ సింగమట్లు - పొదలి నావు
రాస లీల దేలి - రాధమ్మ మది దోచి
సేవలందు కొనవె - శ్రీనివాస!! 33

నందు నింట బుట్టి – నవనీత హారివై
చిలిపి పనుల నెన్నొ – చేయునాడు
ఘల్లు ఘల్లు మనుచు – గజ్జెలందెలు మ్రోగ
త్రిభువనాలు మెచ్చె – శ్రీనివాస!! 34

శబరి యెంగిలి తిని – సంతసించిన యట్టి
పరమ హంస వీవు – భవ్య చరిత।
సర్వ మయుడవీవు – సరిలేరు నీకేరు
చిద్విలాస యీశ – శ్రీనివాస!! 35

కర్ణ పేయమైన – గంధర్వ గానాన
గండ శిలలు గూడ – కరగిపోవ
మురళి రవళి చేత – మూడు లోకమ్ములున్
ప్రేమ జలధులయ్యె – శ్రీనివాస!! 36



అణువు నణువులోన – నణగియుండెడి నిన్ను
త్రికరణాల వలన – తెలుసుకొనిన
చావు పుట్టుకనెడు – జంజాటమును లేక
జీవి ముక్తి నొందు – శ్రీనివాస!! 37

మంచి చెడుల మధ్య – మనసు నూగుచు నుండ
చేయదగిన పనులు – చేయలేక
పిచ్చివానివోలె – పచ్చిగా వాకొందు
మేను మరచి పోయి – శ్రీనివాస!! 38

తండ్రి మాట బట్టి – తనయుండు వనికేగ
రమయు వోయె, రాజ్య – రమయువోయె,
కాముడున్న చోట – రాముడుండగలేని
చిన్నె లెన్న తరమె – శ్రీనివాస!! 39


చదువు లెల్ల చదివి – సర్వజ్ఞుడైనను
ఆలు బిడ్డలంచు – అంగలార్చు
నిన్ను తెలియ లేక – నిట్టూర్చు నిగుడించి
సిగ్గు చెందడకట – శ్రీనివాస!! 40

దొంగతనము చేసి – దొరలైన వారలు
ఉలుకు పలుకు లేక – ఊరు కొనగ
ఎరుక లేని వారి – నిరికింపజూచెదు
చిత్రమేమొగాని – శ్రీనివాస!! 41

యోగదృష్టి పోయి – బోగ దృష్టి పెరుగ
గతులు దప్పి జాతి – కలకబారె
నీతి రీతి పరిధి – నిర్వేద్యమైయున్న
చెన్ను మీరు జనత – శ్రీనివాస!! 42

అడ్డదారి త్రొక్కి – యార్జించి ధనమును
దొడ్డ వారి యందు – దొసగు లెంచు
దుష్ట బుద్ధులిలను – శిష్టులై మనుచుండ
కానవేమి నీవు – శ్రీనివాస!! 43

కులము మతములంచు – కుమ్ములాటలు రేపు
కుటిల వర్తనమ్ము – పాటమరింప
దానవత్వమిలను – తలయెత్తి జనతకు
చేటు తెచ్చు చుండె – శ్రీనివాస!! 44



మనిషి కట్టుకున్న - ఇనుప గోడలెగాని
కుల మతాలు లేవు - కువలయాన
మంచి మనసుకన్న - మతమేది? కులమేది?
మానవాళి కిలను - శ్రీనివాస!! 45

కలియుగాన బ్రతుకె - కష్టమై పోవగా
ముడుపు లెట్లునీకు - ముట్టగలవు
కాన్క లీయకున్న - కలుషముల్ కడుగవా?
హృదయ కుహర వాస - శ్రీనివాస!! 46

అల్పు లయిన వారి - కధికార మబ్బిన
పదవి పరువు పోవు - బయము గొల్పు
చదువు కొనియు జన్మ - సంస్కార మెరుగని
వానికేల పదవి - శ్రీనివాస!! 47

వ్యసన పరుని జూచి - పరిహసించిరి నాడు
వ్యసన పరుడె నేడు - బవ్యగుణుడు
మంచి చెడ్డలన్ని - మదిలోని మార్పులె
శ్రీరమావిలోల - శ్రీనివాస!! 48

బంధు మిత్రులెల్ల - అందలం బెక్కించి
కోర్కె దీర్చుకున్న - కూల ద్రోయు
కుటిల జనుల తోడ - కూడరాదిలపైన
చిత్త మరసి చూడ - శ్రీనివాస!! 49

సిగ్గులేని వాడు – చెడ్డ పనులు జేసి
చిన్న నవ్వు నవ్వి – చెప్పుచుండు
వాని కంటె, భువిని – వాయసంబు మేలు
శేషభోగి శయన – శ్రీనివాస!! 50

న్యాయ పథము వెంట – నడచు వారల తోడ
తగవు పడుట భువిని – తగవుగాదు
అగ్గితోడ జేరి – యాటలాడదగునె
జీవితాశ విడిచి – శ్రీనివాస!! 51

ధనము కూడబెట్టు – తలపు మంచిదెకాని
ధర్మ మార్గమెపుడు – తప్ప రాదు
పరుల నోళ్ళు గొట్టి – పైకమ్ము గడియించు
చెనటి కేమి శిక్ష – శ్రీనివాస!! 52



కొండ వంటి మనిషి – గుండె లోతుల లోన
కొంచెమున్న చాలు – మంచి తనము
మహిత యశము తోడ – మనుచుండి జగతిలో
మాననీయుడగును – శ్రీనివాస!! 53

చదువు 'కొన్న' వాని – సరసత్వమంతయు
చొప్పదంటు పగిది – నొప్పియుండు
చదువు వలన వచ్చు – సౌశీల్య భావాలు
వానికేల నొదవు – శ్రీనివాస!! 54

కామకేళి తోడ – కాలమ్ము గడిపిన
మనిషి పశువు వోలె – మారిపోవు
దాని నణచకున్న – మానవత్వమునకు
హీనగతియె గల్గు – శ్రీనివాస!! 55


ఇచ్చు వారలున్న – చచ్చు వాడును లేచి
దానమందు కొనగ –తపన పడును
'దాన మనిన మాటె' – ప్రాణమ్ము నిలుపును
శ్రీదయాధినాథ – శ్రీనివాస!! 56

కాలు జారెనేని – కాయమ్ము గాయమౌ
నోరు జార, మనసు – నొచ్చు కొనును
జారుపాటులున్న – జరుగు బాటుండునా
క్షితిని యేరికైన – శ్రీనివాస!! 57

పరుల జూచినవ్వు - గురువింద గింజలు
తమను జూచి కొనరు - తలలు వంచి
ఆత్మశోధలేని - యాకతాయిల వల్ల
చేటు వచ్చె భువికి - శ్రీనివాస!! 58

పలువ లున్నయట్టి - పాడు సంఘము నందు
మంచి వారి యునికి - మాయమగును
కాకులున్న చోట - కలహంసలుండునా?
శ్రీవిలాస యాశ - శ్రీనివాస!! 59

మాన్యుడైన వాని - మానసంబు, చివరి
దశను గూడ నున్న - తమోయగు, రవి
యస్తమించు వేళ - నరుణ కిరణ పంక్తి
చేరుకొనదెనింగి - శ్రీనివాస!! 60



పలుకుబడి గలట్టి – వంది మాగధులకు
బట్ట నలగ కుండ – పనులు జరుగు
కష్టజీవి పడెడు – కడగండ్లు పోకార్ప
జేయు, సదయు లెవరు – శ్రీనివాస!! 61

ప్రతి దినమ్ము నిన్ను – భక్తితో భజియింతు
కుచ్ఛితమ్ము పోయి – కచ్ఛె తొలగ
మనసు మంచిదైన – మనువు సార్థకమౌను
శేష తల్ప శయన – శ్రీనివాస!! 62

వ్యక్తి పరిచయమ్ము – బ్రతుకు బాటను జూపు
తెలివి తేటలుండి – తెలుసుకొనిన
పరిచయమ్ము లేని – బ్రతుకేల నిలపైన
శేముషీ వికాస – శ్రీనివాస!! 63


స్వార్థ పరుని మ్రోల – సాష్టాంగ పడుకంటె
బండకట్టి బావి – బడుట మేలు
స్వార్థ పరుడు పరుల – సౌఖ్యమ్ము గోరునా?
మానసాన నెపుడు – శ్రీనివాస!! 64

అందినపుడు జుట్టు – అందకున్నను కాళ్ళు
పట్టు కొనెడి వారు ప్రబల చుండ
ఆర్ష ధర్మమెల్ల – అధ్వాన్నమై పోయి
జీర్ణదశకు చేరె – శ్రీనివాస!! 65

తల్లి భాష నేర్ప – నొల్లని తండ్రుల
యుల్ల మొటులు మహిని – పల్లవించు
తల్లి పాలెరుగని – తనయుల పగిదిగ
చేవలేక యుండు – శ్రీనివాస!! 66

ఉన్నవాడెపుడును – ఉన్న వానికె పెట్టు
లేని వానికిడడు – లేశమైన
ఉర్విలోన జనుల – ఉపకార భావాల
శీలమిట్టులుండె – శ్రీనివాస!! 67

పాఠశాలలకును – పఠనశాలలకును
హాజరైన చాలు – నదియె చదువు
చదువు సంధ్యలిట్లు – చట్టుబండలుగాగ
చివికి పోయె బుద్ధి – శ్రీనివాస!! 68



పూర్వ జన్మమందు – పురుడు వోసికొనిన
పాప సంచయమ్ము – బాపుకొనగ
'ఆత్మయజ్ఞ' మనెడి – యస్త్రంబు సంధించు
శిష్ట గుణము నిమ్ము – శ్రీనివాస!! 69

పుట్టె యందు పుట్టు – పుట్టెడు కోర్కెలు
తీరకున్న యెడద – తృప్తి పడదు
తృప్తిపడని యెడద – తృష్ణ తీర్పగరాదు
జీవితాన నెపుడు – శ్రీనివాస!! 70

సుఖములందు నపుడు – చూడడెంతటి వాని
కష్ట కాలమందు – కన్ను దెఱచు
ఇట్టి వారి సృష్టి – నేల చేసెనో బ్రహ్మ
శేషతల్ప శయన – శ్రీనివాస!! 71


రాజకీయ మిలను – రంగులు మారుచు
ఒప్పు చుండె ప్రజల – ఓట్ల కొఱకు
దేశ పాలనమ్ము – దిన దిన గండమై
చింత్య మానమయ్యె – శ్రీనివాస!! 72

చెట్టు చేమలన్ని – ఛేదించి వేసినన్
వన్య మృగములన్ని – వలస బోవు
నిలువ నీడలేక – నీరసింతురు జనుల్
జీవితాశ లేక – శ్రీనివాస!! 73

బుద్ధి లతకు పూయు – పూలతో పూజింప
కరిని గాచినట్లు – కాచు నీవు
తరులతాదు లిడెడి – విరులతో నర్చింప
తృప్తి నొంద గలవె – శ్రీనివాస!! 74

అస్తి నాస్తి చర్చ – విస్తారముగ జేసి
అంతుబట్ట లేరు – యజ్ఞపతిని
అహము గల్గువారి – కానందమయుడేల
కానిపించుమదికి – శ్రీనివాస!! 75

నొసలు వెక్కిరింప – నోరు మాటాడెడి
ధూర్తజనుల గనిన – దురిత మంటు
అట్టి వారిగుట్టు – రట్టు చేయగబోయి
శిలగ మారినావె – శ్రీనివాస!! 76



కలసి వచ్చు వేళ – కలతలన్నియుదీరి
పట్టుకొనిన మట్టి – పసిడియగును
కలసిరాని వేళ – కాలమ్మె సర్పమై
చిమ్ము చుండు విషము – శ్రీనివాస!! 77

అన్నమయ్య వోలె – ఆరాధకుడనౌచు
త్యాగరాజు రామ – తత్త్వ మరసి
మానవత్వమున్న – మనిషిగా బ్రతికెద
క్షితిని మేలు గూర్చు – శ్రీనివాస!! 78

సంతతమ్ము భువిని – సత్వగుణుని వోలె
సంచరించుకొనెడి – సంపదిడుము
తామసాన నీదు – తత్త్వంబు తెలియక
చెదరు చుండె మనసు – శ్రీనివాస!! 79

సర్వభూతములకు – సాక్షిగా నిలుచుండి
ధర్మ ముద్ధరింప – తనువు దాల్చి
అంతరాంతరాల – ఆత్మగా వెలుగొందు
చిన్మయుండవీవె – శ్రీనివాస!! 80

భజన సేయు నరుడు – బ్రహ్మమ్ముగనలేడు
సేవ చేయబోవ – చావదహము
ఇంద్రియాల నణచ – శ్రీశుడే దిగివచ్చు
శ్రీరమా విహార – శ్రీనివాస!! 81

మంచి చెడుల నరయు – మాన్యులు కర్వైరి
నడచు వారి వెనుక – నడతురెపుడు
గొఱ్ఱెదాటు మతము – కూర్చునా సౌఖ్యంబు
చెరచు గాని జనుల – శ్రీనివాస!! 82

ముప్పు మూపు మంచు – ముడుపు లెన్నియొగట్టి
ఏడు కొండలెక్కి – యెదుట నిలువ
పొమ్ము పొమ్మటంచు – పుజారి నెట్టుటన్
చెప్పుకొనిన సిగ్గు – శ్రీనివాస!! 83

నీతి లేని బ్రతుకు – నీచమంచెంచరు
చెడ్డ బ్రతుకు కంటె – చెఱుపు లేదు
అట్టి బ్రతుకు కంటె – ఆత్మ హత్యయె మేలు
శేషశైలవాస – శ్రీనివాస!! 84



కలుములమ్మ వడిని – కరగి పోయెడి వేళ
మనము నందునన్ను – మరువ కుండ
పచ్చ బొట్టు పగిది – వదనాన ధరియించు
దీనజన శరణ్య – శ్రీనివాస!! 85

ప్రత్యహమ్ము నిన్ను – భక్తితో భజియించు
భక్త గణము పైన – రక్తి జూపి
దివ్య దర్శనమ్ము – తృప్తిగ నిచ్చెడి
శ్రీకరుండవీవె – శ్రీనివాస!! 86

పరమ సుఖము కొఱకు – ప్రాకులాడునె గాని
పాటు బడగ నొడలు – వంచబోడు
ఒడలు వంచకున్న – నొదవు నా సౌఖ్యంబు
వృషభశైల వాస – శ్రీనివాస!! 87

పరమ భక్తుడైన – ప్రహ్లాదు డొందిన
బాధ లేవి నేను – బడయకుండ
పిలువగానె వచ్చి – ప్రేమైక భావనన్
సేమ మరయు మయ్య – శ్రీనివాస!! 88

సమత మమత నెఱవు – జవరాలి వీవంచు
మంగమాంబ హృదయ – రంగమందు
ప్రణయ కేళి సల్పు – పట్టభద్రుడవని
చేరి కొలుతునయ్య – శ్రీనివాస!! 89

నల్లనయ్య! నిన్ను - నమ్మికొనిన నేను
విరహ తాపమంది - పొరలు చుండ
రాధ యధర సుధల - రంజిల్లు చుంటివా?
చీరవేమి దరికి - శ్రీనివాస!! 90

దేవుడనిన తప్పు - దేహియనిన తప్పు
చేయుమన్న తప్పు - చేయ తప్పు
తప్పులెంచు వారి - తప్పుడు సంస్కృతిన్
చిదుపవేమి ధరను - శ్రీనివాస!! 91

వగల మారి వనిత - వయసు సొగసు జూచి
ఒడలు మరచి వెంట - బడెడి వాని
మోహ మెడల కున్న - మోక్షంబు దొరకునా?
శేషగిరి నివాస - శ్రీనివాస!! 92



గొప్ప పనులు చేయ – గోరెడు వారికి
కష్ట శతములెన్నో – కలుగు చుండు
వాని నవల ద్రోయు – వాడె సన్నుతి నొందు
శ్రితజన పరిపాల – శ్రీనివాస!! 93

చెడుగు జూచి జనులు – చింతించు టేలకో
మంచి తనము చెడును – మాడ్కి వేయు
అగ్ని కణము దూది – నంత మొందింపదా?
శిఖి శిఖా సమాన – శ్రీనివాస!! 94

కోటికి పడగెత్తు – కోటీశ్వరుండైన
దైవ దూరుడగుచు – తనరెనేని
అంత్య కాలమందు – ఆయాసమున జిక్కి
చేరలేడు పరము – శ్రీనివాస!! 95

భూత దయయులేని – నేతలెందరొ నేడు
రక్కసీంద్ర పగిది – రాజ్యమేల
బుద్ధదేవు సూక్తి – బుగ్గయ్యె, జగతిలో
చెదరిపోయె శాంతి – శ్రీనివాస!! 96

నియమ నిష్ఠలున్న – నిస్వార్థుడవనిలో
భాగ్యహీను డౌచు – బ్రతుకలేడు
శీల ముజ్జగింప – శ్రీమంతుడౌ, వాడె
శిష్ట గుణుడు నేడు – శ్రీనివాస!! 97

కొడుకు కొఱకు మ్రొక్క - కొందురు కొందరు
కూడు పెట్ట కతడు - కొఱవి పెట్టు
కొఱవి పెట్టు కొఱకు - కొడుకె కావలయునా?
శిష్ట హృదయవాస - శ్రీనివాస!! 98

బ్రతుకు తెరువు కొఱకు - వెతగూరు ప్రజ యెల్ల
తప్పు సేయుచుంద్రు - ధరణిలోన
వారి తప్పులెల్ల - వారించి బ్రోచెడి
జీవరత్న మీవె - శ్రీనివాస!! 99

కర్కశాత్ములైన - కలిమాయ విభవుల
కపట కల్మషాగ్ని - కమిలిపోతి
కరుణతోడ నాకు - కనుపించి మదిలోని
సేగి తీర్చుమయ్య - శ్రీనివాస!! 100



ఫాలభాగమందు – బ్రహ్మ తేజమ్మును
కనుల యందు దివ్య – కాంతి వెలయ
శాంతి పథము వెంట – సంచరించిన యట్టి
శ్రీఘనుండవీవె – శ్రీనివాస!! 101

రామ మంత్ర మెపుడు – రక్షయై చెలువారి
పాప బుద్ధి నెల్ల – పార ద్రోలు
నామ భజన సేయు – నరుల నాలుక కది
చెఱకు రసము గాదె – శ్రీనివాస!! 102

విశ్వ రూపుడగుచు – విస్తరిల్లెడిదేవ!
ఇరుకు గుడులలోన – నిమడ గలవె?
రోషమంది తల్లి – రోట గట్టిన నాడు
చింత దీర్ప లేదె – శ్రీనివాస!! 103

విదురు నింట విందు – ప్రియముగా గుడిచిన
వేద వేద్య! నాదు – పిలుపు నంది
రమ్య గతుల తోడ – రమ్ము మా యింటికి
ప్రేమ మయుడవైన – శ్రీనివాస!! 104

నీదు మహిమ తెలియ – నెరుగ రాదెవరికి
అయిన నేమి? నిన్ను – నాశ్రయింప
పుణ్య గుణములెన్నో – బోధ జేసితి వయ్య
శిష్ట గురుని వోలె – శ్రీనివాస!! 105

పూలలోన మధువు – పాలుపారు రీతిగా
ప్రాణి కోటి యంత – రంగమందు
ప్రేమ శీధు విడెడి – పెనువేల్పువీవంచు
చింత జేతునయ్య – శ్రీనివాస!! 106


అఖిల జనుల కెల్ల – ఆనంద జనకమౌ
నీదు పల్కు కొఱకు – నిల్చి యుంటి
ఆర్తి నెల్లబాపి – అమృతంపు వాక్కులన్
వీను లలర జేయు – శ్రీనివాస!! 107

యాగ భాగ చయము – లారగించెడి దేవ!
బ్రతుకు లోని యనుబ – వాల నిటుల
విన్న వించు కొంటి – వినయ మింపెసలార
శ్రేయ మొనర జేయు – శ్రీనివాస!! 108



జలజ నాభ నాదు – శతకమ్ము నాలించి
కొండలన్ని దాటు – కొనుచు వచ్చి
ఆదరాన నన్ను – ఆశీర్వ దించుము
ప్రీతి కలుగునట్లు – శ్రీనివాస!! 109

జయము వేంకటేశ – జయము కిల్బిషనాశ
జయము తిరుమలేశ – సత్ప్రకాశ
జయము కలియుగేశ – జయము శేషాద్రీశ
స్నిగ్ధ భావ తేజ – శ్రీనివాస!! 110





వృత్త సంకీర్తనము

(అనుబంధము)

శ్రీ వేంకటేశ్వర నక్షత్రమాలిక

★★★

శ్రీయుత మూర్తి! మౌనిజన సేవిత దివ్య పదారవింద! యా
మ్నాయ వచస్స్వరూప! యసమాన బలాన్విత! నీదు సన్నిధిన్
పాయని భక్త శేఖరుల పంక్తిని జేరగ నెంచు నాకు భ
ద్రాయిత రూప దర్శన విధంబెరిగింపుము వేంకటేశ్వరా!!

– 2 –

కొండల నెక్కలేను, బుధకోటికి కొంగు పసిండి రూపమై
యుండెడి నిన్ను గాంచి సరసోక్తుల నాడగ లేను, నిత్యమున్
దండిగ వేడి కొందు భవతాప మడంపగ జేయుమయ్య, యో
గండరగండ! దుష్ట కలికల్మష మర్దన వేంకటేశ్వరా!!

– 3 –

కొలిచిన నీదు రూపమునకుంఠిత భక్తి గుణంబుగల్గు, తా
తలచిన నీదు నామము సుధారస వాహిని ముంచి యెత్తు, వే
నిలిపిన నీదు తేజము వినిర్మల విద్యలు బోధ జేయు నో
కలియుగ దైవమా! పరమ కారుణికోత్తమ వేంకటేశ్వరా!!

– 4 –

కంటిని కావ్య రాజముల గాథల నెల్ల; మహాద్భుతంబుగా
వింటిని హేతు వాదముల వింతలనంతము; చూడ చూడ నీ
రెంటను సత్యమేదొ వివరింపగ నేరక ప్రాణి కోటి క
న్నింటికి జీవమీవె గాని నిశ్చయ మొందితి వేంకటేశ్వరా!!

– 5 –

ఎందరు గోపికారమణు లిచ్ఛను మెచ్చి వరించినారో? యిం
కెందరు పుణ్యపూరుషుల బిప్సిత మొంది తరించినారో? పె
రొందిన పాపరాధులిల నుత్తలమంది లయించినారో? నా
రందరి జాడ లేనెరుగ నార్త జనావన! వేంకటేశ్వరా!!

– 6 –

చెలిమి తొలంగెనేని తన చెంతకు చేరరు మిత్రులెవ్వరున్,
కలిమిలయించెనేని నిజకాంతయు రోయును నెమ్మనంబునన్,
బలిమి యడంగెనేని గత వైభవమంత నశించు; నష్టని
న్నెలమిదలంచినంత విషయేచ్ఛ లడంగవె వేంకటేశ్వరా!!

– 7 –

తప్పు లెరుంగ లేక దురితంబులనేకము మందబుద్ధినై
గొప్పగ జేసితంచుకడు కుందెదనిప్పుడు తెల్విగల్గి, నా
తప్పుల నోర్వ నీవెగతి; తక్కటి వేల్పుల గొల్వబోను; నీ
కొప్పిదమైన రీతి ననునోమవె సత్కృప వేంకటేశ్వరా!!

– 8 –

చేరిన కాసు వీసముల చిక్కులు దీర్చెడి ధార్మికత్వమున్
దూరిన యంక పొంకముల దోషమడంచెడి శాంత చిత్తమున్
కోరిన శక్తి యుక్తులిల కూరిమినిచ్చెడి నీదు మంగళా
కారము కన్నులన్ బడగ గల్గదె మోదము వేంకటేశ్వరా!!

–9 –

అంతము లేనిదీ జగతి యంతయు మాయ యటంచునేదొ వే
దాంతము పల్కు చుందురు గదా। సభలందున, సుంతవారిలో
గొంతుమె చిత్తశుద్ధని యొకానొక పట్టున నైనగాని; యే
కాంతమునందొనర్చెడి వికారములన్ గను వేంకటేశ్వరా!!

– 10 –

పలుకులలో విరాగమును భావములంద నురాగ మొప్ప నీ
తులు వచియించు చుందురుగదోయి విశుద్ధ మనస్కులై సదా
కిలకిల నవ్వుచున్ జగతి కేవల కృత్రిమ భావ మూర్తులై
చెలగిన దోసమంచనెడి సిగ్గది యుండదు వేంకటేశ్వరా!!

11 –

శైల శిఖాగ్రవాసమున శైల గుణంబులు నిన్ను బొందెగా
బోలు, దయార్ద్ర చిత్తుడవు పోల్చగరాని శిలాత్మకుండవై
గ్రాలుచునుంటివేల? త్రిజగన్నుత। మామక కష్ట సంఘము
న్వాలన సేయగా నొక శిలాకృతి వైతివ వేంకటేశ్వరా!!

– 12 –

పాలన సేయుటే తగును భక్తులు కోరి భజించుచుండ, నీ
యాలన పాలనా రహితులై యిలనేగతి ముక్తు లౌదురీ
కాల కరాళ గహ్వర వికార విపత్పరి వేష్టితాత్మ క
ల్లోలిత జీవకోటి యతిలోక గుణాన్విత వేంకటేశ్వరా!!

– 13 –

కొలిచెడి దీన మానవుల కుంఠిత భక్తి రసార్ద్ర చిత్తులై
పిలువగ పల్కు దేవ! నిరుపేదలపాలిటి పెన్నిధానమై
నిలిచిన నీదు రూప మహనీయత వాకొన నాతరంబె? ఆ
కలుముల తల్లియే పొగడ గావలె సొంపుగ వేంకటేశ్వరా!!

– 14 –

మెచ్చినగాని యాతనిని మెచ్చరటంచు దలంచి, ముందుగా
మెచ్చులె పల్కుచుందురవి మేలొన గూర్చునె! యేరికైన; నా
మెచ్చుల జీవితంబు మెరమెచ్చులదై వ్యథగూర్చు; నైననున్
సచ్చరితుండు గూడ ముఖ సంస్తుతిలోబడు వేంకటేశ్వరా!!

– 15 –

వందియు మాగధుండు బలె ప్రస్తుతి సేయగ, నెంతవారలున్
బందుగునైన గాని విడువన్ వెనుకాడరు, స్తోత్రపాఠి నా
నంద నిమగ్న చిత్తమున నాదర దృష్టి జూచి వానితో
బందుగుకన్న మిన్నగను వర్తిలు చుందురు వేంకటేశ్వరా!!

- 16 -

నీవనువాడవీ జగతి నీగతి రక్ష యొనర్పకున్న తా
రేవిధి నుండగా గలరొ యించుక యైన తలంపబోవరో
పావన మూర్తి! నీ పరమ పావన నామము నాత్మలోన సం
భావన సేయు వారికి శుభంబులు గల్గవె వేంకటేశ్వరా!!

- 17 -

నరుడను వాని బ్రహ్మ సృజనంబొనరించియు నంతబోక యా
నరునకనంత బుద్ధి నిడినాడిల, వాడొక సృష్టి కర్తగా
బరగుచు మర్త్య లోకమున భాసుర సృష్టి నొనర్చుచుండె, యీ
యిరువుర నెవ్వరెవ్వరి సృజించిరొ తెల్పుము వేంకటేశ్వరా!!

- 18 -

సరసపు వర్తనంబున యశంబొనగూడు నటన్న సూక్తి లో
నెరిగిన వారు గూడ గడు హీనపు వర్తనులై చరింతురీ
వరయక యుంటచే నదియు నభ్యుదంబగు మార్గమంచు నీ
నరు లనిశంబు తద్గతి చనంగ దలంతురు వేంకటేశ్వరా!!

- 19 -

తిరుపతి పోవు వారుకడు దివ్య పథంబగు కాళహస్తి బో
వరు సమయంబు లేదనుచు; పాడియెయిట్టు లొనర్ప; దేవులం
దరు నొకటే యటన్న మరి ధారుణినిన్ని విధాల దేవులన్
వరలగ జేయనేల? తెలుపంగదె యిమ్ముగ వేంకటేశ్వరా!!

– 20 –

చేసెడి దాని సిగ్గు విడి చెప్పును సత్పురుషుండు; దానినే
మూసి మరో విధిన్ బలుకు ముద్దుగ మధ్యముడైన వాడు; నే
బ్రాసి యథార్థ మెన్నడును బల్కడు, దానను నేమివచ్చు; స
న్యాసి తనంబె కన్పడు యథార్థము దాగదు వేంకటేశ్వరా!!

– 21 –

ధనమున కాసజేసి తలిదండ్రుల బంధుల కాలదన్నుచున్
మనమున శంకలేక యభిమానము, లజ్జయు వీడి దుష్ట చిం
తనమున సర్వసంపదలనంతముగా గడియించు వారి జీ
వనమున శాంతి యుండునె రవంతయు నైనను వేంకటేశ్వరా!!

– 22 –

ఒకడొక గద్దె నెక్క నొకడూరక వానికి నీళ్ళుదోడు; నిం
కొకడు మహోన్నత స్థితిని నుండగ నొక్కని కన్నుకట్టు; పె
రొకడు విపత్తులంబడ మరొక్కని కెంతయొ తృప్తిగల్గు; వా
రికినిది నైజమైన జనులేగతి మెత్తురు వేంకటేశ్వరా!!

– 23 –

సరసులు మెచ్చు లాగున విశాల విభావన గ్రాలుచున్న నే
దురితములంటకుండునని దోషవిదుల్ విశదీకరింతు రా
పరమ రహస్యమున్ దెలిసి వర్తిలునట్లు దలంపకీ నరుల్
గురుతర దోష పంకమున గూలగ నెంతురు వేంకటేశ్వరా!!

– 24 –

ఘనమగు గుజ్జు రూపమును, కార్యములన్ జెడగొట్టు నేర్పు, నా
ననమున నేన్గు పోలిక గనంబడునట్లుగ నేకదంతమున్,
ఖనకము వాహనంబుగను, కల్పన జేసిన విఘ్న నాయకున్
తనదు నిజ స్వరూపము కనంబడదెందును వేంకటేశ్వరా!!

– 25 –

సారము లేనిదే యగు విచారము జెందగ నేల తాము సం
సారము గూర్చి, బిడ్డలను సారము లేవిదియైన యట్టి సం
సారములోన ద్రోయుదురు సారమెరింగిన పెద్దలెల్ల, నీ
కారణమేమొ దెల్పు మిల గారవ మొప్పగ వేంకటేశ్వరా!!

– 26 –

సురుచిర రూప సంపదల సోయగముల్ వెలయించువాడవై
పరమ మునీశ్వరేశ్వర తపః ఫలకాంతుల చెన్ను మీరుచున్
కరమనురక్తి మీర మమకారములన్నియుడుల్లజేసి యీ
ధరణిని గాచు పెద్ద సరదారుడ వీవెగ వేంకటేశ్వరా!!

– 27 –

చదువుల తల్లి నన్ను తన సందిట జేరిచి ముద్దు లాడి, తా
పదముల పొంకముల్ దెలియబల్కుచు చక్కగ తీర్చి దిద్ద నె
మ్మది నిటు బల్కుచుంటిని రమావిభవాతిశయుండవైన నీ
మదికి ముదంబొసంగ, నను మాన్యుని జేయుము వేంకటేశ్వరా!!

నివేదన

★★

శ్రీగల యింట బుట్టి, తులసీదళదామ విభూషణావళుల్
భోగమటంచు నెంచు ఘన పుణ్య విభుండగు నమ్మురారికిన్
సాగిలి మ్రొక్కు చుందు భవ సాగర మీదెడి శక్తి యుక్తులన్
వేగిర మిచ్చు గాత యని విహ్వల చిత్తత నార్తి నొందుచున్!!

– 2 –

సేమము కోలుపోయి, విభుసేవలు మెండుగ సేయలేక, దో
షామయ జీవినై బ్రతుక సాకుచు నుంటిని దుర్భరంబుగన్
మామక వేదనల్ తొలగు మార్గము జూపుచు బ్రోచు నీదు ని
ష్కామ కళా విలాసమును కంజదళాక్ష! నుతింతునిత్యమున్!!

– 3 –

కమ్మని వేణుగానము వికారము లన్నియు బాపి కృష్ణత
త్వమ్ము మనమ్మునంగ దుర భాసిలు తానొక యోగివోలె, నే
కొమ్మను జూచినన్ మధుర కూజిత నిస్వనమే ధ్వనించుటన్
అమ్మక చెల్ల! నా హృదయ మమ్మక చెల్లద యేమి సేయుదున్!!

– 4 –

బుద్ధి తెలియని వయసున హద్దు మీరి
కాని కార్యంబు లెన్నియో గడపి నాడ
అభయమిమ్ము ముకుంద నే నార్తి నొంది
అడుగుచున్నాడ బేలనై బిడయ పడుచు!!

– 5 –

మోక్ష సామ్రాజ్య లక్ష్మి యుప్పొంగునటుల
భక్త తతికెల్ల బ్రియమున ముక్తి నొసగి
లోకముల గాచు రాధికాలోలు కొనుము
ప్రేమ మీర హృదయ నివేదనమ్ము!!

◆◆◆



ఆకాంక్ష



శ్రీరమణీమణీ కరకుశేశయ పూత మరంద ధారలన్
జారగొనన్ మధువ్రతము చొప్పున జీవిత యాత్ర జేయగా
గోరి భజించు చుండెద నకుంఠిత భక్తిని నిన్నుఁగూర్చి; నా
కోరిక దీర్పవే లలిత గోప వధూ మధురోప గూహనా!!

– 2 –

నీ వదనార విందమును నిత్యము నా హృదయాంతరాన స
ద్భావముతో ధరింపగ నుపాయములిన్ని దినాల నుండి నా
కేవిధి జిక్కదయ్యె, తుదకీ విధి నీకవితాసుమాల నా
భావమునన్ బ్రగాఢముగ బంధితుగా నొనరించు కొందుగా!!

– 3 –

మనమున నెమ్మిగూర్చి విసుమానముగల్గ జగంబునందు మ
త్తనువును స్వీకరించి ననుధన్యగ జేయుదువంచు ముగ్ధమో
హన వదనమ్ము పైని నడయాడెడి వేణురవమ్ములోన నన్
అనిశము ముంచి యెత్తెదవటంచు యశోద కుమార నమ్ముదున్

– 4 –

వికలత జెందు చిత్తమును వేయి విధంబుల చిక్కబట్టుచున్
సకలము నీవె యంచు మది సాధన జేసి గ్రహించినాడ, నీ
వికసిత పాద పద్మ మధు బిందువులానెడి భృంగ పంక్తిలో
నొక యెలదేటిగా బ్రతుక నువ్విళులూరుచునుందునో ప్రభూ!!

– 5 –

తలిరుల జిందులాడు నునుదళ్ళల వోలె చరించు సంపదల్
గలిగిన నాల్గు నాళ్ళు నినుగానగ లేక నకార్య శీల సం
కలిత మనోరథమ్ములను గాలము బుచ్చుచు వ్యర్థ జీవినై
కళవళమందు చుంటి నను గావుము వేగమ రుక్మిణీధవా!!

– 6 –

ఎప్పటికప్పుడే హృదయ మిచ్చి భజింతును, నన్ను జూడకే
తప్పి చరించు చుందు విది ధర్మమె? నీ హృదయాంబుజాత మం
దెప్పటికైన నీ జనుని యేలెడి కోర్కె జనించు నేమొ యం
చొప్పగ నాసబూని యిటులుంటిగదా। దయజూడరాగదే!!

– 7 –

హృదయమునందొకింత కరుణింపగ నిన్ బ్రతిమాలుకొందు, నీ
పద జలజద్వయిన్ మిగుల భక్తి దలిర్ప ధరింతు నౌదలన్
ముదమొదవించు నీ మధుర మోహన రూపము నాకురంగటన్
విదిత మొనర్పుమయ్య, కడు వేసట నందితినో యదూద్వహా!!

